
క్షీరాభిషేకం






చోడవరం శ్రీలక్ష్మీనారాయణ సహిత నాగేంద్రస్వామి ఆలయం వద్ద పూజలు

మోపిదేవిలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం వద్ద క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

నాగుల చవితి వేడుకలను జిల్లా వ్యాప్తంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి దీపారాధన చేసి పుట్టలో పాలుపోసి మొక్కు తీర్చుకున్నారు. మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం, పెనమలూరు మండలం చోడవరం శ్రీలక్ష్మీనారాయణ సహిత నాగేంద్రస్వామి ఆలయం, గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు నాగేంద్ర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచివుండి స్వామివారిని దర్శించుకుని తరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 4లో


డీఎస్సీకి వేళాయె!

కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో *1,208* టీచర్ పోస్టుల భర్తీ భర్తీకి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఇప్పటికే జిల్లాల వారీగా రోస్టర్ పాయింట్ల ఆధారంగా పోస్టులను గుర్తించింది. డీఎస్సీకి సమయం ఆసన్నం కావడంతో ఎట్టిపరిస్థితుల్లో ఈ సారి పోస్టు కొట్టేందుకు అభ్యర్థులు తీవ్రమైన కసరత్తు చేస్తున్నారు.

ఉమ్మడి కృష్ణాలో 1,208 టీచర్ పోస్టుల భర్తీ

నేడు డీఎస్సీ నోటిఫికేషన్!

- ఇప్పటికే రోస్టర్ పాయింట్ల ఆధారంగా టీచర్ పోస్టుల గుర్తింపు
- టీచర్ పోస్టు సాధించేందుకు అభ్యర్థుల కసరత్తు



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు రంగం సిద్ధమైంది. డీఎస్సీ షెడ్యూలును ప్రభుత్వం బుధవారం విడుదల చేసే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 16,700 టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో టీచర్ పోస్టుల భర్తీ కోసం రోస్టర్ పాయింట్లను విద్యాశాఖ ఉన్నతాధికారులు పదిరోజుల కిందట జిల్లా విద్యాశాఖ అధికారులకు పంపారు. జనరల్, మహిళల కోటా, ఎస్సీ, ఎస్టీ, బీసీలలో ఏబీసీడీ కేటగిరీలకు ఎన్ని పోస్టులు కేటాయించాలనే అంశంపై ఈ పాయింట్ల ఆధారంగా జిల్లా విద్యాశాఖ అధికారులు ఆయా కేటగిరీల వారీగా టీచర్ పోస్టులను గుర్తించారు. ఉమ్మడి జిల్లాలో 1,208 పోస్టులను భర్తీ చేయాల్సి ఉందని నివేదికను ప్రభుత్వానికి పంపారు.

నాడు 117 జీవో ప్రకారం తక్కువ పోస్టులే..

వైసీపీ ప్రభుత్వ హయాంలో 117 జీవో ప్రకారం 3,4,5 తరగతులను సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో వీలినం చేశారు. దీంతో పాఠశాలల్లో టీచర్లు మిగులుబాటుగా ఉండిపోయారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికల ముందు జిల్లాలో 209 పోస్టులను మాత్రమే భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్‌ను అప్పటి ప్రభుత్వం విడుదల చేసింది. అభ్యర్థులు పరీక్ష రాసేందుకు సమాయత్తమయ్యేందుకు సమయం చాలదని, వివిధ కారణాలతో ఈ డీఎస్సీ నోటిఫికేషన్‌ను హైకోర్టు రద్దు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు పచ్చజెండా ఊపింది. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక టీచరు ఉండేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది. ఇందుకు అనుగుణంగా టీచర్‌పోస్టులను భర్తీ చేయనుంది. 2025 ఏప్రిల్ 30వ తేదీ నాటికి ఏర్పడే ఖాళీలను బట్టి జిల్లాలో టీచర్ పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు టీచర్ పోస్టులు కొట్టేందుకు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు.

ఆయా కేటగిరీల వారీగా జిల్లాలో భర్తీ చేసే టీచర్ పోస్టులు ఇలా..

టీచర్‌ల కేటగిరీ	జడ్పీ/ప్రభుత్వ	మునిసిపల్	మొత్తం
ఎస్‌ఏ తెలుగు	35	20	55
ఎస్‌ఏ హిందీ	23	9	32
ఎస్‌ఏ ఇంగ్లీష్	88	9	97
ఎస్‌ఏ లెక్కలు	48	7	55
ఎస్‌ఏ, పిజికల్‌సైన్స్	53	6	59
ఎస్‌ఏబయాలిజికల్‌సైన్స్	140	3	143
ఎస్‌ఏ సోషల్	130	5	135
ఎస్‌ఏపిజికల్‌ఎడ్యుకేషన్	122	4	126
ఎస్‌జీటీ	450	50	506
మొత్తం	**1096**	**113**	**1208**

మున్సిపల్ పాఠశాలల్లో టీచర్ పదోన్నతులు ఇచ్చేనా!

ఇటీవల ప్రభుత్వం మున్సిపల్ పాఠశాలల్లో పనిచేసే టీచర్‌లకు పదోన్నతులు ఇచ్చేందుకు అనుమతులు ఇచ్చింది. నూతనంగా టీచర్ పోస్టుల భర్తీ జరగనున్న నేపథ్యంలో మున్సిపల్ పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు పదోన్నతులు నిలిచిపోతాయని ఉపాధ్యాయ సంఘాల నాయకులు సూచనప్రాయంగా చెబుతున్నారు. మున్సిపల్ పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులకు మాత్రం పదోన్నతులు ఇచ్చే అంశంలో ఎలాంటి అభ్యంతరాలు ఉండవని పేర్కొంటున్నారు.

భవన నిర్మాణాల్లో ఇష్టారాజ్యం

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు భవన యజమానులు నీళ్లొదులుతున్నారు. అనుమతి తీసుకున్న ప్లాన్‌కు, చేస్తున్న భవన నిర్మాణాలకు పొంతన లేకుండా పోతోంది. వీటిపై స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఆ వైపు ఎవరూ కన్నెత్తి చూడటంలేదు.

నగరంలోని 10, 40వ డివిజన్లలో జోరుగా నిర్మాణాలు

- నిబంధనలకు నీళ్లొదులుతున్న యజమానులు
- మున్సిపల్ కార్పొరేషన్‌కు ఫిర్యాదు చేసిన స్థానికులు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు


మచిలీపట్నం 40వ డివిజన్‌లో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పక్కనే నిర్మిస్తున్న భవనం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నంలోని 40వ డివిజన్ పంపులచెరువు సమీపంలో ఓ వ్యక్తి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా భవననిర్మాణం చేస్తున్నాడు. గృహసముదాయానికి అనుమతులు తీసుకుని ఓ విద్యాసంస్థను ఏర్పాటు చేసేలా భారీస్థాయిలో భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. ఈ భవనం ఎదుట 12 అడుగుల మేర మాత్రమే సిమెంటు రోడ్డు ఉంది. ఈ రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్‌లు ఉన్నాయి. డ్రెయిన్‌లకు చెందిన జాగా పోతే 10 అడుగుల రోడ్డు మాత్రమే ఉంది. ఈ భవనం ఎదురుగా ఉన్న డ్రెయిన్‌కు ఒక్క అడుగు కూడా జాగా వదలకుండా భారీ స్థాయిలో పిల్లర్లు వేసి మరీ భవనం నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు వెంబడి ఉన్న గృహాల యజమానులు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరంతా నిబంధనలను పక్కనపెట్టి భవన నిర్మాణం చేస్తున్నాడని మునిసిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. అయినా ఏ ఒక్క అధికారి కూడా అటు వైపు కన్నెత్తి చూడలేదు. ఏదైనా భవన నిర్మాణం చేయలంటే టౌన్‌ప్లానింగ్ నిబంధనల ప్రకారం కనీసంగా 10శాతం స్థలాన్ని సెట్ బ్యాక్‌గా వదలాలి. కానీ ఇక్కడ ఒక్క అడుగు స్థలం కూడా వదిలిన దాఖలాలు లేవు.

నూతన భవనం నిర్మాణం చేయాలంటే ముందుగా ఆన్‌లైన్‌లో మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. కానీ ఈ డివిజన్‌లో భవనం నిర్మాణం చేసే వ్యక్తి మాత్రం ఈ ప్లాన్‌ను 40వ డివిజన్ సచివాలయానికి కాకుండా, వేరే సచివాలయానికి ప్లానింగ్‌కు సంబంధించిన పత్రాలు వెళ్లేలా తెరవెనుక చక్రం తిప్పాడు. తనకు అనుకూలమైన సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో మునిసిపల్ కార్యాలయానికి నివేదిక ఇచ్చేలా వ్యూహాత్మకంగా వ్యవహరించాడు. దీంతో వేరే సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా 40వ డివిజన్‌లో భవన నిర్మాణానికి అనుమతులు తెచ్చుకున్నాడు. 40వ డివిజన్ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ భవన నిర్మాణం జరిగే ప్రాంతానికి వెళ్లి నిబంధనల ప్రకారం భనవ నిర్మాణం చేయడంలేదని ఫిర్యాదులు వచ్చాయని చెబితే, తనకు చాలా మంది రాజకీయ నాయకులు తెలుసని చెప్పి అతడిని పంపేస్తున్నాడు. దీంతో చేసేదిలేక స్థానికులు మునిసిపల్ కార్పొరేషన్‌లో ఈ భవన నిర్మాణాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు చేశారు. అయినా ఎవ్వరూ ఆ వైపునకు కన్నెత్తి చూడటంలేదు.

పక్కా వ్యూహంతో భవన నిర్మాణానికి అనుమతి

మరో రెండు చోట్ల నిర్మాణాలు అంతే..

ఈ భవనం సమీపంలోనే మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారికి పక్కనే మరో భవనం అడ్డగోలుగా నిర్మాణం చేస్తున్నారు. జాతీయ రహదారికి, నూతనంగా నిర్మాణం చేసే గృహానికి మధ్య 20 అడుగుల మేర జాగాను వదలాలని ప్లాన్‌లో ఉంది. అయితే తెలివిగా ఈ స్థలాన్ని బహుమతిగా తన కుమారులకు ఇస్తున్నట్లుగా చూపారు. గిఫ్ట్‌గా ఇచ్చినట్లుగా చూపిన స్థలంలోనూ మూడు అంతస్తులలో భవనం నిర్మాణం చేయడం గమనార్హం. ఈ భవనం నిర్మాణం వద్ద సెట్‌బ్యాక్‌ను వదలలేదు. ప్రధాన రహదారి వెంబడి ఇంతా జరుగుతున్నా మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఏ కారణంచేతనో ఇటువైపు కన్నెత్తి చూడటంలేదు. నగరంలోని 10వ డివిజన్ జిల్లా కోర్టు సెంటరు నుంచి నాయర్ బడ్డీ సెంటరుకు వెళ్లే రోడ్డు వెంబడి ఒక ప్రైవేటు స్కూలుకు సమీపంలో నిబంధనలకు వ్యతిరేకంగా రెండు భవనాలను అడ్డగోలుగా నిర్మాణం చేస్తున్నారు. అధికారులు అడ్డుచెప్పకుండా ఉండేందుకు ఈ భవనాల నిర్మాణం చేసే వ్యక్తి ఆదివారం సెలవురోజు చూసుకుని మరీ ఇందులోని ఒక భవనానికి శ్లాబు కూడా వేశారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేస్తుంటే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. నగరంలోని 40, 10వ డివిజన్‌లలో నిర్మాణంలో ఉన్న భవనాల వద్దకు అధికారులను పంపిస్తాం. వారు ఇచ్చిన అనుమతులకు వ్యతిరేకంగా నిర్మాణాలు జరుగుతుంటే చర్యలు తీసుకుంటాం.

- బాపిరాజు, మునిసిపల్ కమిషనర్

ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీపై విచారణ నేడు

4లో

కీచక ఉపాధ్యాయుడిపై వేటు

రవాణాశాఖ అధికారిపై విచారణకు ఆదేశం

పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద 2 నెలలుగా అనధికార వసూళ్లు!

- 'దారి దోపిడీ' శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురించిన ఆంధ్రజ్యోతి
- స్పందించిన రాష్ట్ర రవాణా శాఖ ఉన్నతాధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అనధికార వసూళ్లకు పాల్పడుతున్న రవాణాశాఖ అధికారిపై విచారణకు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. పదహారవ నంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 16)పై పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద రెండు నెలలుగా ఓ అధికారి ప్రైవేటు వ్యక్తులతో అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారు. లారీలపై టార్చ్‌లైట్లు వేయించి సడెన్‌గా నిలుపుదల చేయించటం, వారి దగ్గర నుంచి డబ్బులు గుంజడం వంటి సంఘటనలు ఇక్కడ నిత్యకృత్యం అయ్యాయి. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు సైతం పోతున్నాయి. దీనిపై ఆంధ్రజ్యోతి 'దారి దోపిడీ' శీర్షికతో ప్రత్యేక కథనం మంగళవారం ప్రచురించింది. ఈ కథనంపై రాష్ట్ర రవాణా శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపడుతున్నారు. అయితే ఈ విచారణను నీరుగార్చేందుకు కొంతమంది రవాణా శాఖ అధికారులు తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. పొట్టిపాడు టోల్‌ప్లాజా దగ్గర ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించినా.. వీరి వసూళ్ల బాగోతం బయటపడుతుంది. రవాణా శాఖ ఉన్నతాధికారులు ఈ అంశంపై దృష్టి సారించి విచారణ సమగ్రంగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రైల్వే పనులకు నిధుల విడుదల



- మచిలీపట్నం-రేపల్లె నూతన రైల్వేలైన్ సర్వే పనులకు రూ.1.13 కోట్లు
- బాపట్ల-రేపల్లె నూతన రైల్వేలైన్ సర్వే నిమిత్తం మరో రూ.1.15 కోట్లు
- ఫలించిన మచిలీపట్నం ఎంపీ బాలశౌరి కృషి



మచిలీపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం-రేపల్లె మధ్య నూతన రైల్వేలైన్ నిర్మాణం కోసం సర్వే పనుల నిమిత్తం నిధులు విడుదల చేస్తూ రైల్వే బోర్డు డైరెక్టర్ అభిషేక్ జగవర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం-రేపల్లె మధ్య 45.30 కిలోమీటర్ల మేర నూతన రైల్వేలైన్ నిర్మాణం చేస్తామని ఎంపీ ఇటీవల కాలంలో చెబుతున్నారు. ఈ రైలు మార్గం నిర్మాణం చేసేందుకు డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)ను తయారు చేసేందుకు రూ.1.13 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే బాపట్ల-రేపల్లె మధ్య 45.81 కిలోమీటర్ల మేర నూతన రైల్వేలైన్ నిర్మాణం కోసం డీపీఆర్‌ను తయారు చేసేందుకు రూ.1.15 కోట్లు విడుదల చేశారు.

దశాబ్దాల కల

మచిలీపట్నం-రేపల్లె మధ్య నూతన రైల్వేలైన్‌ను ఏర్పాటు చేయాలని కృష్ణాజిల్లా వాసులు దశాబ్దాలుగా కోరుతూ వస్తున్నారు. ఎంతోకాలంగా ఈ ప్రతిపాదన ఉన్నా కనీసం సర్వేపనులకు కూడా నిధులు విడుదల కాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎంపీ బాలశౌరి మచిలీపట్నం-రేపల్లె, రేపల్లె-బాపట్ల మధ్య నూతన రైల్వేలైన్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత నెల 2వ తేదీన మహాత్మాగాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు మచిలీపట్నం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ అంశంపై ఎంపీ బాలశౌరి వివరించారు. ఈ రెండు రైల్వేలైన్లను అనుసంధానం చేస్తే కోల్‌కటా నుంచి చెన్నై వెళ్లే రైళ్లు విజయవాడ జంక్షన్‌కు వెళ్లకుండా, మచిలీపట్నం మీదుగా వెళ్లడానికి అవకాశం ఏర్పడుతుందని వివరించారు. ఈమార్గం గుండా రైళ్లు ప్రయాణిస్తే 70 కిలోమీటర్ల దూరం తగ్గడంతోపాటు విజయవాడ జంక్షన్‌పై రైళ్ల ట్రాఫిక్ కూడా కొంతమేర తగ్గుతుందని చెప్పారు. ప్రయాణ సమయం కలసి రావడంతోపాటు సరుకు రవాణా ఖర్చులు తగ్గుతాయని ఎంపీ ముఖ్యమంత్రికి వివరించారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణం పూర్తయితే సరుకుల రవాణాను తక్కువ ఖర్చుతో చేయవచ్చని కూడా చెప్పారు.

విద్యలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారి రామారావు



4లో



సెస్ తగ్గింపు.. ధాన్యం రైతుకు ఊరట

4లో

నాగుల చవితికి పోటెత్తిన భక్తులు



కుటుంబసభ్యులతో కలిసి పూజలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, సుబ్బారాయుడి సేవలో బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ ఎంపీలు మోపిదేవి వెంకటరమణారావు, కనకమేడల రవీంద్రకుమార్



మోపిదేవి/పెనమలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నాగుల చవితి పర్వదినం పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. మంగళవారం తెల్లవారు జాము 2.30గంటలకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు విచ్చేయగా, ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు, అర్చక బృందం పూర్ణకుంభంతో వేద మంత్రాలతో స్వాగతం పలికారు. నాగపుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేసి పుట్టలో పాలుపోసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేయగా, శేషవస్త్రాలతో అర్చక బృందం ఎమ్మెల్యే దంపతులను సత్కరించారు. ఉదయం 3 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించగా, పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు పుట్టలో పాలుపోసేందుకు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం నుంచి ప్రధాన జాతీయ రహదారిపై కిలోమీటర్ మేర భక్తులు బారులు తీరారు. స్వామివారిని దర్శించుకుని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం ఆధ్వర్యంలో పులిహోర, మంచినీరు, పాలు స్వచ్ఛంద సంస్థ సేవకులచే ఉచితంగా పంపిణీ చేశారు. అన్నసమారాధనను ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు ప్రారంభించారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో 130 మంది సిబ్బందిచే ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

సుబ్బారాయుడి సేవలో పలువురు ప్రముఖులు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, రాజ్యసభ మాజీ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, కనకమేడల రవీంద్రకుమార్‌లు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి స్వాగతం పలికారు. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు వారికి అందజేశారు.

చోడవరంలో ..

ఉమ్మడి కృష్ణా జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన చోడవరం లక్ష్మీనారాయణ సహిత శ్రీనాగేంద్రస్వామి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. చోడవరంలో స్వయంభుగా వెలిసిన స్వామిని దర్శించుకోవడానికి జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లు భక్తజనంతో కిటకిటలాడాయి. దూర ప్రాంతాల నుంచి తిరునాళ్లను చూడడానికి వచ్చిన బంధుమిత్రులతో చోడవరం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. స్వామివారి అన్న ప్రసాదాలను వేలాదిగా భక్తులు స్వీకరించారు. భజన, కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెనమలూరు, ఉయ్యూరు సీఐలు వెంకటరమణ, రామారావు, ఎస్సైలు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



మోపిదేవిలో బారులు తీరిన భక్తులు



చోడవరంలో లక్ష్మీనారాయణ సహిత నాగేంద్రస్వామి.. పుట్టలో పాలుపోసేందుకు భక్తుల క్యూ



ఎంఈవోల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రామారావు

విద్యలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

» కృష్ణా డీఈవో రామారావు

మచిలీపట్నం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో కృష్ణాజిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ఎంఈవోలు బాధ్యత వహించాలని డీఈవో పీవీజే రామారావు అన్నారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో ఎంఈవోలతో పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రతి విద్యార్థి పేరు యుడైస్‌తో పాటు అపార్‌తో అనుసంధానం చేయాలన్నారు. పుట్టిన తేదీ, పేరు, ఆధార్ కార్డును అపార్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలోని 25 మండలాల్లో ఇంకా పెనమలూరు, కృత్తివెన్ను, మోపిదేవి, ఉయ్యూరు, కంకిపాడు మండలాలు అపార్‌లో వెనుకంజలో ఉన్నాయన్నారు. దీనిపై ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రతినిధులు శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయాలన్నారు. పదోతరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ వహించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులతో కమిటీ సమావేశాలు నిర్వహిస్తూ విద్యార్థుల సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. బడికి సక్రమంగా హాజరుకాని పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రామాల్లో తల్లిదండ్రులను విద్యావిషయక కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమాజం నుంచి మెప్పు పొందేలా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు మిగిలిన వారికి ఆదర్శంగా నిలవాలన్నారు. పాఠశాలల్లో క్రమశిక్షణ కొరవడకుండా ఉండేలా ఎంఈవోలు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏడీ మనోహర నాయక్, బందరు డీవైఈవో శేఖర్‌సింగ్, గుడివాడ డీవైఈవో పద్మారాణి, సీఈ బోర్డు సెక్రటరీ షేక్ జాన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీపై విచారణ నేడు

» కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్, ఆర్ఐతోపాటు ఫిర్యాదుదారుడికి ఆర్డీవో నోటీసులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయంలో కుటుంబసభ్యులందరికీ తెలియకుండానే ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్(ఎఫ్ఎంసీ) జారీచేసిన ఘటనలో కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో విచారణ చేయాలని మచిలీపట్నం ఆర్డీవోను ఆదేశించారు. కలెక్టర్ సూచనల మేరకు బుధవారం ఈఅంశంపై విచారణ జరుగుతుందని, ఉదయం 10గంటలకు ఆర్డీవో కార్యాలయంలో హాజరుకావాలని మచిలీపట్నం తహసీల్దార్, ఆర్ఐ, ఫిర్యాదుదారుడైన ఐ దిలీప్‌కుమార్‌కు నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. మచిలీపట్నం చిలకలపూడి రెవెన్యూ గ్రామపరిధిలోని ఆర్ఎస్ నెంబరు 440లోని ఐదెకరాలభూమి వేణుగోపాలరావు పేరున ఉంది. ఆయన మరణించడంతో కుటుంబసభ్యులు భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకోసం ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ తీసుకునే సమయంలో వేణుగోపాలరావు రెండో కుమార్తె పేరును ఎఫ్ఎంసీలో చూపకుండా అప్పటి తహసీల్దార్, రెవెన్యూ ఇనస్పెక్టర్ 2022 జూలై 23న సర్టిఫికెట్‌ను జారీచేశారని ఆరోపిస్తూ టీడీపీ నేత ఐ దిలీప్‌కుమార్ రెండువిడతలుగా ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో వైసీపీ పెద్దలు తెరవెనుక చక్రం తిప్పారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఈ భూమిని రియల్ ఎస్టేట్ వెంచరుగా మార్చి ప్లాట్లు విక్రయిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ ఆదేశాల మేరకు, మచిలీపట్నం ఆర్డీవో మంగళవారం విచారణకు ఆదేశించారు. నార్త్‌మండల తహసీల్దార్, ఆర్ఐలతోపాటు ఫిర్యాదుదారుడు ఐ దిలీప్‌కుమార్‌ను బుధవారం ఉదయం 10గంటలకు ఆర్డీవో కార్యాలయంలో జరిగే విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీచేశారు.

ట్రాక్టర్‌కింద పడి బాలుడు దుర్మరణం



సాయికుమార్

మచిలీపట్నం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అప్పటి వరకూ సరదాగా ఆడుకుంటూ రోడ్డుపై పరిగెడుతున్న ఓ బాలుడు ట్రాక్టర్‌కింద పడి మృతి చెందిన ఘటన స్థానికులకు కంటతడి పెట్టించింది. ఉల్లింగిపాలెంలో వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు మునిసిపాలిటీ ట్రాక్టర్‌ద్వారా తాగునీరందించి

తిరిగి వెళుతుండగా ట్రాక్టర్ చక్రాల కిందపడి నాలుగేళ్ల బాలుడు సాయికుమార్(4) మృతిచెందాడు. ఈ సంఘటన ఆ ప్రాంత ప్రజల హృదయాలను కదలించివేసింది. ఇనకుదురు సీఐ పరమేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కాంట్రాక్టు పద్ధతిన ట్రాక్టర్ ఆయా ప్రాంతాల ప్రజలకు తాగునీరందించి వెళుతోంది. ఆ సమయంలో అక్కడే ఆడుకుంటున్న బాలుడు పరిగెడుతూ ట్రాక్టర్ వెనుక చక్రం కింద పడి మృతి చెందాడు. నాలుగేళ్లకే నూరేళ్లు నిండాయని బాలుడి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. వాహనాలను చూడకుండా ఆడుకునే పిల్లలకు ఇదొక హెచ్చరికలా మిగిలింది. ట్రాక్టర్ డ్రైవర్ జవ్వారి శ్రీనును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలుడి మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. బాలుడి తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యాధికారి వేధింపులకు గురిచేస్తున్నారు!

» డీఎం అండ్ హెచ్‌వోకు ఏఎన్ఎంలు, ఆశాల ఫిర్యాదు

కూచిపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తమను ఉద్యోగులుగా గుర్తించటం లేదని, రోగుల ఎదుట అవమానిస్తున్నారని, అత్యవసర సమయాల్లోనూ సెలవులు మంజూరు చేయటం లేదని మొవ్వ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేదరాజు ప్రవర్తనను నిరసిస్తూ ఏఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది మంగళవారం మూకుమ్మడిగా పీహెచ్‌సీ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు డీఎం అండ్ హెచ్ఎం గీతాబాయికి 53 మంది సంతకాలతో కూడిన ఫిర్యాదును అందజేశారు. అనారోగ్య సమస్యలు, ఇతర ముఖ్యమైన పనులు ఉన్నప్పుడు సెలవులు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. స్టాఫ్ అటెండెన్స్ వేసినా కావాలని రిజెక్ట్ చేసి గైర్హాజరు వేస్తున్నారని, దీనివల్ల నెలలుగా జీతంలో కోత విధించబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోగులకు, స్టాఫ్‌కు అందుబాటులో ఉండటం లేదని, సూపర్‌వైజర్లను స్టాఫ్ రూమ్‌కి పిలిపించి గంటల తరబడి మాట్లాడుతున్నారని ఆరోపించారు. వీటన్నింటిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని వారు వినతిపత్రంలో కోరారు. సీహెచ్‌వో శంకరరావు, సూపర్‌వైజర్ విజయకుమార్, ఆయుష్ వైద్యులు డాక్టర్ భగవాన్, విజయకుమారి, శ్రీ లక్ష్మి, సమిత, పలువురు ఏఎన్ఎంలు, ఆశాలు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మొవ్వ పీహెచ్‌సీ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్ఎంలు, సిబ్బంది, ఆశాలు

డీఎం అండ్ హెచ్‌వో విచారణ..

సెలవుపై వెళ్లాలని డాక్టర్ వేదరాజ్‌కు సూచన



మొవ్వ పీహెచ్‌సీ ఉద్యోగులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు డాక్టర్ వేదరాజ్‌పై ఇచ్చిన ఫిర్యాదుపై జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ గీతాబాయి మంగళవారం సాయంత్రం విచారణ చేపట్టారు. వేదరాజ్ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా మొదటి తప్పుగా మన్నించి ఒక్క అవకాశం ఇచ్చి చూడాలని ఉద్యోగులకు ఆమె సూచించారు. అవమానాలు ఎదుర్కొంటూ ఉద్యోగాలు చేయటం తమవల్ల కాదని వారు తేగేసి చెప్పడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సెలవులోకి వెళ్లాలని డాక్టర్ వేదరాజ్‌కు సూచించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానని తెలిపారు.

కీచక ఉపాధ్యాయుడిపై వేటు

» కేసు నమోదు.. అరెస్టు, రిమాండ్

కోడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కోడూరు శివారు నరసింహాపురం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు కటికల వేణుగోపాలరావును విధుల నుంచి తొలగిస్తు డీఈవో పీవీజే రామారావు ఉత్తర్వులు జారీ చేసినట్టు కోడూరు ఎంఈవో టి.వి.ఎం.రామదాసు తెలిపారు. కుమార్తెపై అసభ్యంగా ప్రవర్తించి తొడపై కొరికాడని బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.ఉపాధ్యాయుడిపై ఫోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్ నిమిత్తం మంగళవారం మొవ్వ కోర్టుకు పరచగా, జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కె.చాణిక్య తెలిపారు.

టచ్‌లో తేడా వస్తే తాట తీయండి : ఎస్ఐ జాస్మిన్

గుడివాడ : సురక్షితమైన స్పర్శలు ఆరోగ్యంగా ఉంచుతాయి.. టచ్లో తేడా వస్తే తాట తీయాలని టూటౌన్ ఎస్ఐ జాస్మిన్ విద్యార్థినులకు హితబోధ చేశారు. మంగళవారం స్థానిక స్కూల్‌లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పలు విషయాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పరిచయం లేని వ్యక్తులు ఇచ్చే తినుబండారాలను తీసుకోవద్దని, ఎక్కడ పట్టుకోవాలి, ఎక్కడ ముట్టుకోవాలనే అంశంపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో ఈవ్‌టీజింగ్‌కు వ్యతిరేకంగా ప్రత్యేకంగా మహిళా సిబ్బందిని ఏర్పాటు చేశామని జాస్మిన్ తెలిపారు. పాఠశాల డైరెక్టర్ కాళ్లకూరి హరిప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడే పట్టభద్రుల ఓటర్ల నమోదుకు ఆఖరు

» శిబిరాలు ఏర్పాటు చేసి దగ్గరుండి నమోదు చేయిస్తున్న పార్టీల నేతలు



కంప్యూటర్ల వద్ద పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు

మచిలీపట్నం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు బుధవారం ఆఖరి రోజు కావడంతో టీడీపీ నాయకులు శిబిరాలు నిర్వహించి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. నగరంలోని వివిధ డివిజన్లలో టీడీపీ, జనసేన నాయకులు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించారు. సీఎం చంద్రబాబు ఓటర్ల నమోదుపై సీరియస్‌గా తెలుగుదేశం నాయకులకు ఆదేశాలు జారీ చేయడంతో టీడీపీ నాయకులు అలర్ట్ అయ్యారు. డివిజన్లలో ఫారాలు పట్టుకుని ఏ ఇంట్లో గ్రాడ్యుయేట్లు ఉన్నారో వెతుకులాట ప్రారంభించారు. కార్యాలయాలు, పాఠశాలల వద్దకు వెళ్లి గ్రాడ్యుయేట్ల ఫారాలు నింపే కార్యక్రమం జరిపారు. నిరుద్యోగులైన గ్రాడ్యుయేట్లు సైతం కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో పాటు వాడవాడలా పర్యటిస్తూ ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్ శిడింబి అగ్రహారంలో ఆరు కంప్యూటర్లను ఉంచి ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేస్తున్నారు. ఎంపీడీవో, తహసీల్దార్‌ల వద్దకు వెళ్లి గెజిటెడ్ సంతకం కోసం గ్రాడ్యుయేట్లు పెద్ద సంఖ్యలో మంగళవారం తరలివెళ్లారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ తన కార్యాలయం వద్ద ఓటర్ల నమోదుకు ఫారాలు పూర్తి చేయించారు.

సెస్ తగ్గింపు.. ధాన్యం రైతుకు ఊరట

ధాన్యం కొనుగోళ్లపై మార్కెట్ రుసుం తగ్గించేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యంపై గతంలో ఉన్న ఒకశాతం మార్కెట్ రుసుంను వైసీపీ ప్రభుత్వం రెండు శాతానికి పెంచింది. దీనివల్ల రైతులు నష్టపోయారు. రెండేళ్లుగా సరిహద్దుల్లోని వ్యవసాయ మార్కెట్ కమిటీల రాబడికి గండిపడింది. కూటమి ప్రభుత్వ నిర్ణయంవల్ల ధాన్యం రైతులకు ఊరట కలగనున్నది.

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల)



రెండేళ్లకు ముందు ధాన్యంతో పాటుగా ఇతర వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలకు సంబంధించి విలువలో ఒక శాతం వంతున మార్కెట్ రుసుం (సెస్) ఉండేది. వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రధానమైన రాబడి సెస్ ద్వారా వస్తుంది. వైసీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసమని మౌలిక వసతుల కల్పన పేరుతో 2022 ఏప్రిల్ నెల చివరి వారంలో ధాన్యం కొనుగోళ్లపై ఒక శాతం సెస్సును రెండు శాతానికి పెంచింది. వాస్తవంగా సెస్సును, వ్యాపారులు మార్కెట్ కమిటీలకు చెల్లిస్తుంటారు. అయితే ఈ మేరకు వ్యాపారులు, ధరలో కోత విధిస్తుండటంతో రైతులకు నష్టం కలుగుతున్నది. దీనికితోడు తెలంగాణా రాష్ట్రం సరిహద్దుల్లో ఉన్న జగ్గయ్యపేట, నందిగామ, కంచికచర్ల, తిరువూరు, మైలవరం ఏఎంసీల ఆదాయానికి గండి పడింది. ఆయా కమిటీలకు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రావల్సినంత రాబడి రెండేళ్ల నుంచి రావటం లేదు. తెలంగాణాలో ధాన్యంపై కొనుగోళ్లపై మార్కెట్ సెస్సు పెరగలేదు. అక్కడ ఒక శాతం మాత్రమే వసూలు చేస్తున్నారు. రాష్ట్ర సరిహద్దులో ఉన్న పలు గ్రామాల్లో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి వ్యాపారులు, తెలంగాణాలో ఒక శాతం సెస్సు చెల్లించి మిల్లులకు, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దేశంలో ఎక్కడైన ఒక ప్రాంతంలో సెస్సు చెల్లిస్తే మిగతా ప్రాంతాల్లో వసూలు చేయకూడదు. ఇక్కడ రెండు శాతం ఉండటం వల్ల అసలుకే మోసం వచ్చింది. తెలంగాణాలో ఒక శాతం చెల్లించి, దర్జాగా ధాన్యం తీసుకువెళుతుండటంతో ఏఎంసీల రాబడి బాగా తగ్గిపోయింది. జరుగుతున్న మోసాన్ని అరికట్టేందుకు ఏఎంసీల ఆధ్వర్యంలో దాడులు చేస్తున్నప్పటికీ ఆశించిన ప్రయోజనం దక్కటం లేదు. రెండు శాతం సెస్సు వల్ల జరుగుతున్న నష్టం గురించి ఇటీవల మార్కెటింగ్ శాఖ అధికారులు, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం అమలు చేస్తున్న రెండు శాతం సెస్సును గతంలో వసూలు చేసినట్టుగా ఒక శాతానికి తగ్గించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రెండుశాతం సెస్సును తగ్గించి, మరల ఒక శాతం వంతునే వసూలు చేయాలని ధరల పర్యవేక్షణ కమిటీ సూచించింది. ఈ మేరకు సోమవారం జరిగిన కమిటీ సమావేశంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, కె. అచ్చెన్నాయుడు నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం నుంచి అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వ బాదుడు నుంచి ఉపశమనం కలగనుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ ప్రయోజనం

- కోట వీరబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్



వైసీపీ పాలనలో ఏకపక్షంగా ధాన్యంపై మార్కెట్ సెస్సును రెండు శాతానికి పెంచారు. తెలంగాణాలో ఒక శాతమే ఉండటంతో ఇక్కడ అన్ని విధాలుగా నష్టం జరుగుతున్నది. రెండుశాతం సెస్సును ఒకశాతానికి తగ్గించాలని మంత్రుల కమిటీ నిర్ణయించటం వల్ల రైతులతో పాటుగా అందరికీ ఎంతో ప్రయోజనం కలుగుతుంది. బియ్యం ధర కూడా తగ్గనున్నది. మార్కెట్ కమిటీల రాబడి పెరుగుతుంది.



భవదీప్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

బాలుడి వైద్యానికి మరో రూ.5లక్షలు

» ఎల్వోసీ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వరదనీటి వల్ల బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్‌తో కాలు కోల్పోయి రెండో కాలుకు చికిత్స పొందుతున్న జగ్గయ్యపేటకు చెందిన కొత్తా భవదీప్‌కు మరో రూ.5లక్షలు ఎల్వోసీని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య మంజూరు చేయించారు. గత సెప్టెంబరులో వరదలకు ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్న కొత్తా నాగార్జున కుమారుడు భవదీప్ (12)కు ఇన్‌ఫెక్షన్ సోకి ఒకకాలు పూర్తిగా తొలగించారు. బాలుడు ప్రస్తుతం విజయవాడలోని అంకుర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. తొలుత రూ.10లక్షలు ఎల్వోసీ ఇప్పించిన తాతయ్య, ఆ సమయంలో బాలుడు పూర్తిగా కోలుకునే వరకు ఖర్చును ప్రభుత్వం నుంచి ఇప్పిస్తానని ఇచ్చిన హామీమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి మరల రూ.5లక్షలు మంజూరు చేయించారు. ఎల్వోసీ పత్రాలను మంగళవారం తాతయ్య బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. తాతయ్య ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



క్వారీలోకి ట్రాక్టర్లు వెళ్లకుండా పెట్టిన బోర్డు

కళ్లంవారిపాలెం క్వారీ నిలిపివేత

తోట్లవల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కళ్లంవారిపాలెం ఇసుక క్వారీని మంగళవారం రెవెన్యూ, పోలీస్ అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. క్వారీలో ట్రాక్టర్ల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేయటం, లారీల్లోకి ఇసుకను నింపటం తదితర ఆరోపణలతో తవ్వకాలను నిలిపివేశారు. ఇటీవల 'వైసీపీ దోపిడీ పర్వం' శీర్షికన కళ్లంవారిపాలెం క్వారీపై 'ఆంధ్రజ్యోతి'లో వార్తా కథనం రావడంతో ఒకరోజు తాత్కాలికంగా క్వారీని నిలిపివేసిన అధికారులు మళ్లీ తెరిచారు. అయితే దోపిడీ మాత్రం ఆగటం లేదు. వైసీపీ నేత క్వారీలో తెరవెనుక లోకల్ కార్మికులతో దందా నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోకపోవటం వల్లే ట్రాక్టర్ల నుంచి రూ 1,200 వసూలు చేస్తున్నారని విమర్శలున్నాయి. ప్రభుత్వ లక్ష్యం నీరుగారకుండా క్వారీలో అక్రమ వసూళ్ల కట్టడి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

రెండువేల వ్యాసాల క్లబ్‌లో ఉపాధ్యాయుడు రాంప్రదీప్



తిరువూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి ఎం.రాంప్రదీప్ రెండువేల వ్యాసాలు రచించి క్లబ్‌లో స్థానం సాధించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో సమరయోధుడు, చిత్తరంజన్‌దాస్‌పై రాసిన వ్యాసంతో ఆయన రెండువేల వ్యాసాల జాబితాలో చేరారు. ఇప్పటి వరకు రాంప్రదీప్ 6 పుస్తకాలు, వందకుపైగా పుస్తక సమీక్షలు, మరికొన్ని కథలు రచించారు. ఆయన రచించిన వ్యాసాల్లో ప్రతిజ్ఞా చేద్దాం, మతం మతానికి ప్రత్యామ్నాయం కాదు, అంబేద్కరిజం, నాస్తికత్వం, మత స్వేచ్ఛ వంటి వ్యాసాలు ప్రజాదరణ పొందాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 132,141, 152
చికెన్ విత్ స్కిన్ 254
చికెన్ స్కిన్‌లెస్ 264
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

ఆయిల్‌ఫామ్ సాగుకు రాయితీలు

గన్నవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌ఫామ్ తోట కొత్తగా సాగుచేసే రైతులకు రాయితీ కల్పించటం జరుగుతుందని హార్టీకల్చర్ అధికారి ఇ.హరిచంద్ అన్నారు. మండలంలోని సూరంపల్లిలో హార్టీకల్చర్ ఆధ్వర్యాన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయిల్ ఫామ్ రైతులకు అంతర పంట, మొదటి నాలుగేళ్ల మెయింటెనెన్స్ నిమిత్తం 2.5 ఎకరాలకు రూ.5 250 ఏడాదికి ఇవ్వటం జరుగుతుందన్నారు. దీంతో పాటు ఎన్ని ఎకరాలు సాగు చేసిన ఆయిల్ ఫామ్ మొక్క లను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. కొత్తగా మామిడి, జామ, బొప్పాయి, టిష్యూ కల్చర్, అరటి పంటలకు కూడా రాయితీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. పి.శరత్‌బాబు, వీహెచ్‌ఏ వి.దీక్ష పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై విద్యార్థుల అవగాహన ర్యాలీ

హనుమాన్‌జంక్షన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు మంగళవారం రోడ్డు ప్రమాదాలు తీసుకోవాల్సిన భద్రతా అంశాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రాజేష్ ఆధ్వర్యంలో జంక్షన్‌లోని పలు వీధుల్లో విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి ప్రదర్శన చేశారు. ఆడపిల్లలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ అంశాలపై కూడా అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ మౌలాలి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్సై లక్ష్మీనరసింహమూర్తి, చింతల అప్పారావు

విద్యార్థులకు ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఎస్సై ఎస్.లక్ష్మీనరసింహమూర్తి అన్నారు. మంగళవారం కానుమోలు మాజీ సర్పంచ్ చింతల వెంకట శివఅప్పారావు తన కుమారుడు విశ్వనాథ్ జన్మదినం పురస్కరించుకొని ఏలూరులో ఇంటర్ చదువుతున్న పేద విద్యార్థి గండి కిరణ్ కాలేజీ ఫీజులు నిమిత్తం రూ.27వేలు ఆర్థికసాయాన్ని ఎస్సై చేతులు మీదుగా విద్యార్థికి అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డి అప్పారావు, మర్రాపు జగదీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మానవత కార్యాలయంలో..

బీఎస్‌సీ నర్సింగ్ చదువుతున్న దాసరి గూడెంకు చెందిన పేద విద్యార్థి గొర్రుముచ్చు అనిల్‌కుమార్‌కు కాలేజీ ఫీజులు నిమిత్తం మానవత హనుమాన్ జంక్షన్ శాఖ కార్యాలయంలో రూ.10వేలు ఆర్థికసాయం సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అంద జేశారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు వేగిరెడ్డి సూర్యనారాయణ, చెక్కా సుబ్బారావు, వడ్డి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

బధిర విద్యార్థులకు అన్నదానం

స్థానిక ఏలూరు రోడ్డులోని ఆదిత్య బధిర విద్యాలయం విద్యార్థకు ఏలూరు డీఎల్‌డీవో కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగి ఎస్ నిర్మల తన జన్మదినం పురస్కరించుకొని మంగళవారం విద్యార్థులకు అన్నదానం చేశారు. పాఠశాల కరస్పాడెంట్ అన్నపూర్ణ, ప్రిన్సిపాల్ ఆకుల వెంకట రమణ పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

గన్నవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పలువురిని ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. మంగళవారం మండలంలోని సూరంపల్లి గ్రామ పోలవరం కట్ట దగ్గర బాణావతు సైదా, పామర్తి కనకదుర్గలు అక్రమంగా మద్యం విక్రయిస్తుండటంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై ఇలియాజ్ దాడి చేసి వారి వద్దనున్న 74 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని గన్నవరం ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. అలాగే ఎక్సైజ్ ఎస్సై అల్లూరయ్య ఉంగుటూరు మండలం తేలప్రోలులో ఒక వ్యక్తిని పట్టుకుని అతని వద్ద ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన

కంకిపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కులపై బాలబాలికలకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నామలై అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు, పునాదిపాడులో మంగళవారం నిర్వహించిన కిషోరి వికాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నామలై మాట్లాడుతూ, బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

నకిలీ డాక్యుమెంట్లపై ఫిర్యాదు

పెనమలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తనకు సంబంధించిన కోట్ల విలువైన స్థలాన్ని కాజేయడానికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారంటూ ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ ఇందిరా కాలనీకి చెందిన కంతేటి సుప్రజ, తన ఇద్దరు సోదరిలకు కానూరులో 22సెంట్ల స్థలం ఉందని, దానిని కాజేసేందుకు తాడిగడప పద్మజానగర్‌కు చెందిన చలసాని రాము, అతని అనుచరుడు, డాక్యుమెంటు రైటర్ అయిన వెంకటరమణ తాము సంతకాలు పెట్టని ఒక నకిలీ అగ్రిమెంటును సృష్టించి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తాము వారికి స్థలాన్ని అమ్మి అడ్వాన్సు తీసుకొన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీకటిమయం!

- బస్టాండ్ సెంటర్ నుంచి గండిగుంట బైపాస్ వరకు అంకారప్రాయంగా సెంట్రల్ లైటింగ్
- నగరపంచాయతీ అధికారుల నిర్వహణ లోపంతో వెలగని లైట్లు
- చీకటిలో ప్రధాన రహదారి
- ఇబ్బందిపడుతున్న స్థానికులు, వాహనదారులు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఉయ్యూరు ప్రధాన రహదారిలో సెంట్రల్ లైటింగ్ రోజుల తరబడి వెలగకపోవడంతో చీకటిలో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్ సెంటర్ నుంచి గండిగుంట బైపాస్ వరకు డివైడర్‌పై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ కొన్ని చోట్ల వెలగడం లేదు. మరి కొన్ని చోట్ల వెలుతురు లేకుండా డిమ్ముగా వెలుగుతున్నాయి. దీంతో రహదారిపై చీకటి అలుముకుంటుంది. స్తంభాలకు ఉన్న లైట్లు చాలావరకు వెలగక పోయినా నగరపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెలగని లైట్లు అలంకార ప్రాయంగా ఉంటున్నాయని అధికారులకు తెలియచేసినా పట్టించుకున్నవారు లేరని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు దృష్టి సారించి లైట్లు వెలిగించాలని కోరుతున్నారు.

త్వరలోనే టెండర్లు పిలుస్తాం

సెంట్రల్ లైటింగ్ బల్బులు షేడ్ అవడంతో కొన్ని చోట్ల డిమ్ముగా వెలుగుతున్నాయి. కొత్త లైట్లకు టెండర్లు పిలిచి వారం రోజుల్లో లైట్లు వేస్తామని ఉయ్యూరు నగరపంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు.



ఉయ్యూరు ప్రధాన రహదారి డివైడర్‌పై వెలగని సెంట్రల్ లైటింగ్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● సీఐడీ అధికారులు డీ ప్రసాద్, జీ శ్రీనివాస్

పెనమలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, అధ్యాపకులు అప్రమత్తంగా ఉండాలని సీఐడీ ఆర్వో డీ ప్రసాద్, సీఐడీ డీఎస్పీ జీ శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో సీఐడీ అధికారులు విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కళాశాల వీసీ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సైబర్ బెది రింపుల నుంచి విద్యార్థులు, సిబ్బందిని కాపాడేందుకు కళాశాలతో సీఐడి విభాగం పనిచేయడం అభినందనీయమన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రవిచంద్ మాట్లాడుతూ, విద్యార్థుల వ్యక్తిగత, వృత్తిపరమైన డిజిటల్ సమాచారాన్ని పరిరక్షించే సాధనాలను సమకూర్చడంలో ఇలాంటి కార్యక్రమాలు ప్రాముఖ్యత వహిస్తాయని తెలిపారు. ఫిషింగ్, గుర్తింపు దొంగతనం, ఆన్‌లైన్ మోసం, హ్యాకింగ్, సైబర్ బుల్లీయింగ్ తదితర నేరాలపై సీఐడీ అధికారులు అవగాహన కల్పించారు.



అవగాహన కార్యక్రమానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

ఉంగుటూరు జడ్పీహైస్కూల్‌లో..

ఉంగుటూరు : రోజురోజుకు పెరుగుతున్న ఆన్‌లైన్ మోసా లు, సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, సైబర్ నేరగాళ్లుచేసే మోసాల గురించి తమ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులకు వివరించి వారిని అప్రమత్తం చేయాలని ఉంగుటూరు ఎస్సై యు.గోవిందు అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీహైస్కూల్‌లో సైబర్ నేరాలు, మహిళాభద్రత, రక్షణ, మత్తుపదార్థాల వినియోగం వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్ స్టాగ్రామ్ లాంటి వాటిపట్ల జాగ్రత్తగా వుండాలన్నారు. ముఖ్యంగా ఆకతాయిలు చేసే చేష్టల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా వుండాలని, వెంటనే పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చోరగుడి అనిత, ఉపాధ్యాయులు, పోలీస్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

గన్నవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా చాకిరి చేయించుకుంటున్నారని వెంటనే వేతనాలు విడుదల చేయాలని 104 అసోసియేషన్ జిల్లా కోశాధికారి బి.సుబ్బారావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక సచివాలయం-2 సమీపం లో డాక్టర్ సృజనకు 104 సిబ్బంది మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉమా పాల్గొన్నారు.



డాక్టర్ సృజనకు వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

ఎస్సీ, ఎస్టీల కేసుల్లో త్వరితగతిన ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి

ఉంగుటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీల కేసుల విషయంలో వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందితులను అరెస్టు చేయడం ద్వారా బాధితులకు పోలీస్‌శాఖ పట్ల నమ్మకం కలిగించాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మాలమహానాడు నాయకులు మంగళవారం ఉంగుటూరు పోలీస్‌స్టేషన్లో ఎస్సై యు.గోవిందును కలిసి పలు సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు సరిహద్దు ఆంథోని, నాయకులు సిరివెళ్ల చిట్టిబాబు, అమర్తల జీవన్, ధరణికోట సూర్యప్రకాష్, కాశీ నాగార్జున, పూసల వినయ్, పెనుమాక రాజేష్, నత్తా రామశేషు, పకీరి రత్నరాజు, కొత్తా జోజివరప్రసాద్, తుమ్మలపల్లి రాజు పాల్గొన్నారు.



ఎస్సై గోవిందుకు వినతిపత్రం అందజేస్తున్న మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు

పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలి

గన్నవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్ట భద్రులందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న అన్నారు. స్థానిక ఎన్టీఆర్ బొమ్మసెంటర్‌లో మంగళవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచనల మేరకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్లు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దొంతు చిన్న మాట్లాడుతూ, కృష్ణా గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసా ద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించు కోవాలన్నారు. టీఎన్ఎస్ఎఫ్ మాజీ మండల అధ్యక్షుడు బట్టు బుుషి, పిల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఓటు నమోదు పత్రాలను స్వీకరిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న

నేటితో ముగియనున్న ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

ఉయ్యూరు : గుంటూరు, కృష్ణా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల నమోదు బుధవారంతో ముగుస్తున్నట్టు ఉయ్యూరు ఆర్డీవో బీఎస్ హెలా షారోన్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రెవెన్యూ డివిజన్ పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇంకా ఓటరుగా నమోదు చేసుకొనని వారు సాయంత్రంలోగా అర్హత సర్టిఫికెట్లతో నమోదు చేసుకోవాలని తెలిపారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం పురస్కరిం చుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు అర్చనలు జరిపారు. కానుమోలు గ్రామ మాజీ సర్పంచ్ చింతల అప్పారావు దంపతులు తమ కుమారుడు ఎన్నారై విశ్వనాథ్ జన్మదినం పుర స్కరించుకొని ఆలయాన్ని సందర్శించిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఎస్సై -2 లక్ష్మీ నరసింహమూర్తి, ఏఎస్సై పెద్దిరాజు,ఆలయ మాజీ చైర్మన్ నెరుసు నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు వేగిరెడ్డి బాలాజీ, దన్నే దుర్గారావు, యజ్ఞవరపు గణపతి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ కృషి

ఈ నెల 9,10 తేదీల్లో యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు

గన్నవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యా రంగ సమస్యల పరిష్కా రానికి యూటీఎఫ్ విశేష కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) కృష్ణాజిల్లా శాఖ స్వర్ణోత్సవ మహాసభలు గన్నవరం సీఎల్ రాయుడు రోటరి ఆడిటోరియంలో ఈ నెల 9, 10 తేదీలలో జరగనున్నాయి. ఈ సందర్భంగా స్థానిక బాలుర హైస్కూల్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వాలు విద్యారంగం పట్ల నిర్లక్ష్యం వహిస్తే యూటీఎఫ్ ఎప్పటికప్పుడు పోరాటాల రూపంలో అప్రమత్తత చేస్తుందన్నారు. స్వర్ణోత్సవ మహాసభలు గన్నవరంలో జరగటం మంచి పరిణామమన్నారు. వీటిని విజయవంతం చేసేందుకు యూటీఎఫ్ శ్రేణులంతా సమిష్టిగా కృషి చేయాలన్నారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్, జి.రవిబాబు, జి.రాజాబాబు, శివప్రసాద్, జ్ఞానానందం, జేమ్సు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి: అన్నవరపు

గన్నవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దళితులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలు అరికట్టేదానిపై రాష్ట్రంలో అధికారులతో సమీక్ష సమావేశం జరపాలని జాతీయ షెడ్యూల్ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌కు మంగళవారం హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో పలు దళిత సంఘాలతో కలసి వినతి పత్రం అందజేసినట్లు డీబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు తెలిపారు. కమిషన్ సభ్యుడు సానుకూలంగా స్పందించారన్నారు. శ్యాంకుమార్, కిషోర్ కుమార్, విజయరాజు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



రామచందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు

ఆవు పాలు పంపిణీ

ఉయ్యూరు: నాగులచవితి పర్వదినం పుర స్కరించుకుని లయన్స్ క్లబ్ సభ్యుడు నగ్గున రామసత్యకిషోర్ ఆధ్వర్యంలో భక్తులకు ఆవు పాలు ఉచితంగా పంపిణీ చేశారు. వాకర్స్ సభ్యుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

గన్నవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నాగుల చవితి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో భక్తులు జరుపుకున్నారు. మంగళవారం తెల్లవారు ఝాము నుంచి పుట్టలో పాలు పోసేందుకు భక్తులు బారులు తీరారు. ముస్తాబాద రామలింగేశ్వరస్వామి గుహాలయ ఆవరణలోని సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం దగ్గర ఉన్న పుట్టలో పాలు పోసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ భక్తులకు సౌక ర్యాలు కల్పించారు. కేసరపల్లి గుమ్మడి నాగేంద్రక్షేత్రం, గొల్లనపల్లి, చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురంలో ప్రత్యేక పూజలు జరిపారు.



ముస్తాబాద వద్ద పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

సోమేశ్వరస్వామి ఆలయంలో..

ఉయ్యూరు : ఉయ్యూరు, పరిసర గ్రామాల్లో మంగళవారం నాగుల చవితి పర్వదినం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శివాలయాల్లోని పుట్టలతో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న పుట్టల్లో పాలుపోసి నాగేంద్రస్వామికి పూజలు చేశారు. జగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో వేకువజామునుంచి భక్తులు తరలివచ్చి ఆలయ ఆవరణలో పుట్టలో పాలుపోసి సుబ్రమణ్యేశ్వరస్వామికి పూజలు చేశారు. గండిగుంట కాకాని నగర్, ఆకునూరు బీసీ కాలనీలో పుట్టలవద్ద భక్తులు పాలుపోశారు.



ఉయ్యూరు శివాలయంలో పుట్టలో..

కంకిపాడులో..

కంకిపాడు : మండలంలోని వివిధ గ్రామా ల్లో నాగుల చవితి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంతో పాటు లాకు రోడ్డులోని పుట్ట బజారు వద్ద గల పుట్టలో భక్తులు ఉదయం నుంచి పాలు పోస్తూ బిజీబిజీగా గడిపారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంటలకు రక్షణ.. నాగులచవితి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పెరికీడు, కానుమోలు, ఆరుగొలను, రంగన్నగూడెం, వీరవల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని పొలాల్లో మంగళవారం నాగుల చవితి సందర్భంగా భక్తులు పుట్టలో పాలుపోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగుల చవితి సందర్భంగా ఆలయాల్లో, పొలాల్లోని పుట్టల వద్ద పాలుపోసి తమ సంతానం క్షేమంగా ఉండాలని మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పెరికీడు వద్ద ముక్తేశ్వరాలయం వద్ద నాగశిలకు అర్చకులు శ్యామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కానుమోలు శివారులోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకుల ఆధ్వర్యంలో పొట్లూరి సీతారాంప్రసాద్ దంపతులు, పొట్లూరి పవన్ దంపతులు స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. కానుమోలులో పవన్‌శర్మ ఆధ్వర్యంలో, వీరవల్లిలో మురళీశర్మ ఆధ్వర్యంలో నాగులచవితి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పెరికీడు వద్ద పుట్టలో పాలుపోస్తున్న భక్తులు



కంకిపాడు లాకు రోడ్డులో..



గొల్లపూడిలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గొల్లపూడిలో ఇక రైట్ రైట్..!

● వన్ సెంటర్‌లో డివైడర్ ఏర్పాటు.. ట్రాఫిక్ ప్రక్షాళన

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గొల్లపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడిలో నెలకొంటున్న ట్రాఫిక్‌ను సరి చేసేందుకు పోలీస్ వ్యవస్థ ఎట్టకేలకు కళ్లు తెరిసింది. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన చక్రవ్యూహం కథనానికి పోలీసులు స్పందించారు. గొల్లపూడి మైలరాయి సెంటర్ నుంచి వన్ సెంటర్ వరకు ఏర్పడుతున్న ట్రాఫిక్‌ను కళ్లకు కట్టినట్టు ఆ కథనంలో ఫొటోలతో సహా ప్రచురించడంతో పోలీసులు ట్రాఫిక్‌ను చక్కదిద్దే పనిలో పడ్డారు. సాయిపురం కాలనీ నుంచి జాతీయ రహదారిపైకి వచ్చే వాహనాలు అటు ఇటు వెళ్లకుండా రోడ్డు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం వైపు వెళ్లే వాహనాలు వన్ సెంటర్ క్రాస్‌రోడ్స్ హోటల్ వద్ద ఆగడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతుండటంతో వన్ సెంటర్ వద్ద ఆగేలా చర్యలు చేపట్టారు.

మరో జత్వానీ ఉదాంతానికి తెరలేపిన

వైసీపీ నేతను శిక్షించాలి: జైరాజ్

ధర్నాచౌక్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన మరో జత్వానీ ఉదాంతానికి తెరలేపిన వైసీపీ నేతనుర కఠినంగా శిక్షించాలని జై ఆంధ్ర ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు జైరాజ్ సంగెపు డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. బాపులపాడు మండలం మర్రిభద్రంకు చెందిన దావులూరి ప్రభావతి బ్యాంకు మేనేజర్‌గా ఉన్న మహిళపై స్థానిక మండల వైసీపీ నేత, సర్పంచ్ యోగీశ్వర్‌రావు లైంగిక వేధింపులకు పాల్పడటం, పైగా బాధితురాలిపైనే తప్పుడు కేసులు బనాయించి రౌడీషీట్ ఓపెన్ చేయించడంతో పాటు అనేక ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఈ వ్యవహారంపై సీబీఐతో విచారించి బాధిత మహిళకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బీసీ సాధికార సమాఖ్య అధ్యక్షుడు పామర్తి జయప్రకాష్ నారాయణ, బహుజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పయార్థ చర్చిల్ పాల్గొన్నారు.



మాకు ఉద్యోగ భద్రత కల్పించండి

● గిరిజన గురుకుల ఔట్‌సోర్సింగ్ టీచర్లు

ధర్నాచౌక్, నవంబర్ 5:(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. ఈ మేరకు స్థానిక ధర్నాచౌక్‌లో మంగళవారం ధర్నా చేపట్టారు. ఇతర గురుకులాల్లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ టీచర్లకు చెల్లించేలా అదే పీఆర్సీ ప్రకారం తమకు .జీతాలు చెల్లించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ నుంచి కాంట్రాక్ట్ విధానానికి మార్చాలన్నారు. 2024 మెగా డీఎస్సీలో గిరిజన గురుకుల ఉపాధ్యాయుల పోస్టులు చూపకుండా గిరిజన గురుకులాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనేక ఏళ్లుగా కేవలం రూ.9వేలకే ఎటువంటి సెలవులు లేకుండా ఉద్యోగాలు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఈ ప్రభుత్వంపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. మల్లిర్జున్ నాయక్, పరమేష్, విజయ్‌కుమార్ నాయక్ పాల్గొన్నారు.

అమ్మా.. నాగమ్మ!









చోడవరంలో మహిళల కోలాటం

దుర్గగుడిలో ఘనంగా నాగుల చవితి పూజలు

వన్‌టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ చవితి తిథిని పురస్కరించుకుని మంగళవారం నాగుల చవితి పూజలు ఘనంగా సాగాయి. ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఉపాలయం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడిలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిగాయి. అర్చకులు శాస్త్రోక్త అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి దర్శనానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో కొలువైన నాగదేవత విగ్రహాలకు భక్తులు పాలు సమర్పించి పూజలు చేశారు. నువ్వుల పిండితో చేసిన పదార్థాలు, చలిమిడి నాగదేవతకు నైవేద్యంగా సమర్పించారు. నాగదేవతలకు సంబంధించిన స్తోత్రాలను, నామాలను చదివారు. మంగళవారం కావటంతో వల్లీ, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అర్చనకు ప్రత్యేకత ఏర్పడింది. చవితి మంగళవారం కలిసి రావటంతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అర్చనలు చేసేందుకు భక్తులు భారీగా వచ్చారు.

అన్న వితరణకు విరాళం

విజయవాడ జయప్రకాష్ నగర్‌కు చెందిన నువ్వుల దుర్గ చంద్ర కౌశిక్, రవళి పేరిట అన్నవితరణ చేసేందుకు నువ్వుల భాస్కరరావు, విజయలక్ష్మి మంగళవారం ఆలయానికి విచ్చేసి రూ.1,01,116 చెక్కును ఈవో రామారావును కలిసి అందించారు. అమ్మవారి దర్శనానంతరం వారికి శేషవస్త్రం, ఆశీర్వచనం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, పుస్తకాలను అందజేశారు.



దుర్గమ్మ పంచహారతుల్లో పాల్గొన్న మంత్రి కొల్లు

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి పంచహారతులు సేవ, స్వామివారి సహస్రలింగార్చన, సహస్రదీపాలంకరణ సేవల్లోనూ ఆయన పాల్గొన్నారు. ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు తదితరులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. వేదపండితులు వేదాశీస్సులు అందజేశారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర



ఎన్టీఆర్ జిల్లాలో లక్ష ఉద్యోగాలు

వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తాం

- ఎన్ఐఆర్‌డీతో యువకులు, రైతులకు శిక్షణ
- తిరువూరులో క్లస్టర్ ఏర్పాటు
- జేజేఎం పనులపై ఎంపీ తీవ్ర అసంతృప్తి
- వ్యవసాయరంగంలో డ్రోన్ విప్లవం
- జీజీహెచ్‌కు రూ.110 కోట్ల కేంద్ర నిధులు
- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, చిత్రంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం రాజగోపాల్, తదితరులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలో ఉపాధి అవకాశాలను మరింత విస్తృతంగా కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలతో పాటు, వ్యసాయ, గ్రామీణాభివృద్ధి, పారిశ్రామిక రంగాల్లో ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందుకోసం యువత, రైతులకు పెద్ద ఎత్తున శిక్షణా కార్యక్రమాలతో పాటు, సాంకేతిక ఆవిష్కరణల ద్వారా మరింత ఊతం ఇవ్వనున్నట్టు చెప్పారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎంపీ కేశినేని శివనాథ్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని, కేంద్ర సబ్సిడీ పథకాలను ఎక్కువగా తెచ్చి జిల్లాను మరింత పటిష్టంగా నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. హైదరాబాద్‌లో 256 ఎకరాల విస్తీర్ణంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఆర్‌డీ) సెంటర్ ఉందని, అక్కడ ఎంతో మంది యువకులు, రైతులకు శిక్షణతో పాటు సర్టిఫికెట్లను అందజేసి మంచి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారన్నారు. ఈ సంస్థ సహకారంతో జిల్లాలో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆ సంస్థ సాయంతో తిరువూరులో వారం రోజుల్లో క్లస్టర్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో డ్రోన్ సమ్మిట్ తర్వాత అన్ని రంగాల్లో డ్రోన్ల వినియోగాన్ని తేచ్చి మరింత మందికి శిక్షణ కల్పించి ఉపాధి కల్పిస్తాన్నారు. జిల్లాలో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా నీటి వనరులను సంగ్రహణ నుంచి ట్యాప్ కనెక్షన్ల వరకు నూరు శాతం పనులు జరిగేలా డీపీఆర్ సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలను అత్యాధునికంగా తీర్చిదిద్ది మరిన్ని వైద్య సదుపాయాలను అందుబాటులోకి తెస్తామన్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాను రూ.130 కోట్ల నిధులను మంజూరు చేయాలని కోరానన్నారు. జిల్లాలో 857 అంగన్ వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని, కొన్నింటికి ఉన్నా ప్రహరీలు లేవన్నారు. ప్రతి స్కూల్‌లో క్రీడా మైదానాలుండాలని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కోరుకుంటున్నారని దీనిపై సమగ్ర నివేదికను రూపొందిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) పథకం కింద గ్రామీణ ప్రాంతాలలో రోడ్ల కనెక్టివిటీని పెంచటానికి కృషి చేస్తామన్నారు. జిల్లాలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా 20 వేల టాయిలెట్స్ కట్టాలని నిర్ణయించామన్నారు. వచ్చే మార్చి, ఏప్రిల్ నాటికి టాయ్‌లెట్స్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

అధికారులపై ఎంపీ ప్రశ్నల వర్షం

విజయవాడ: కేంద్ర పథకాలను నూరు శాతం ముందుకు తీసుకు వెళదామని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ అన్నారు. మంగళవారం విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ (దిశ) సమావేశం ఎంపీ శివనాథ్ అధ్యక్షతన జరిగింది. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా సంధానకర్తగా వ్యవహరించారు. ఈ సమావేశంలో ప్రధానంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుపై ఎంపీ సమీక్ష చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న కేంద్ర పథకాలతో పాటు, ఆయా శాఖల్లో ఉపయోగించుకోవటానికి అవకాశమున్న కేంద్ర పథకాలపై చర్చ జరిగింది. ప్రధానంగా ఆరోగ్యశాఖపై తొలుత ఎంపీ సమీక్షించారు. జిల్లాలోని 27 పీహెచ్‌సీ కేంద్రాల్లో సదుపాయాల గురించి డీఎంహెచ్ సుహాసిని అడగ్గా జిల్లాలో పూర్తిస్థాయిలో మెడికల్ ఆఫీసర్లు ఉన్నారని, గైనకాలజిస్టుల కొరత ఉందన్నారు. క్రిటికల్ కేసులు పీహెచ్‌సీల్లో చేయటం లేదని, ప్రభుత్వాసుపత్రికి సిఫార్సు చేస్తున్నామన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ జోక్యం చేసుకుని నెలకు ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయని ప్రశ్నించారు సగటున 5 నుంచి 10 వరకు జరుగుతున్నాయన్నారు. పీహెచ్‌సీలో శానిటేషన్‌పై ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. జన ఔషధి కేంద్రాల గురించి ప్రశ్నించగా డీఎంహెచ్‌వో చెప్పలేకపోయారు. అనంతరం డీఆర్‌డీఏపై సమీక్ష చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలను సృష్టించాలనుకుందని, అందుకనుగుణంగా ఎన్టీఆర్ జిల్లాలో లక్ష ఉద్యోగాలు సృష్టించాలన్న లక్ష్యంతో ముందుకు వెళదామన్నారు. తర్వాత పంచాయితీ రాజ్ శాఖ సమీక్షలో జిల్లాలో పరిమితంగానే రోడ్ల పనులకు ప్రతిపాదనలు ఉండటాన్ని ప్రశ్నించారు. పంచాయితీరాజ్ ఎస్ఈ స్పందిస్తూ ఫేజ్-4లో ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ శాఖ సమీక్షలో పీఎం సూర్యఘర్ పథకం గురించి ఎంపీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. జిల్లాకు 4 వేలు లక్ష్యంగా నిర్దేశించగా 2094 దరఖాస్తులు వచ్చాయని, 418 దరఖాస్తులకు సూర్యఘర్ అమలు చేస్తున్నట్టు సీపీడీసీఎల్ అధికారి చెప్పారు. విద్యుత్ కార్యాలయాలకు సోలార్ ఏర్పాటు చేశారా అని ప్రశ్నించగా, లేదని సమాధానం ఇవ్వడంతో పోనీ ప్రభుత్వ కార్యాలయాలకైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. దానికి కూడా లేదని సమాధానం ఇచ్చారు. ముందుగా ప్రభుత్వ కార్యాలయాలను పూర్తిగా సోలార్ దిశగా నడిపించి తర్వాత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తర్వాత గ్రామీణ నీటి సరఫరాపై సమీక్షలో ఎంపీ అసహనం వ్యక్తం చేశారు. జల్‌జీవన్ మిషన్ పనుల్లో రాష్ట్రంలోనే ఎన్టీఆర్ జిల్లా దారుణమైన స్థానంలో ఉందన్నారు. త్వరగా సమగ్ర డీపీఆర్ తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. డీఆర్వో లక్ష్మీనరసింహం, జడ్పీ సీఈవో కన్నమ్మ నాయుడు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు ఎమ్మెల్యేల గైర్హాజరు

జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశానికి తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాత్రమే హాజరయ్యారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హాజరు కాలేదు.

అధికార భాష హిందీని వినియోగించండి: సాహూ

వన్‌టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ సమావేశపు హాల్‌లో మంగళవారం జరిగిన అధికార భాష అమలు కమిటీ 68వ సమావేశంలో రైల్వే డివిజన్‌లోని ప్రతి కార్యాలయంలోను హిందీని ఇంకా బాగా వినియోగించాలని అధికార భాష హెడ్ క్వార్టర్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ చరణ్ సుందర్ సాహూ కోరారు. డీఆర్ఎం పాటిల్ అధ్యక్షతన డిప్యూటీ డైరెక్టర్ ఎ.కుమార్ విశ్వాస్, సభ్య కార్యదర్శి ఎం.కె. నాగరాజు పాల్గొన్నారు. హిందీ తెలుసుకోవటం, ఉపయోగించటం సులభమని వివరించారు. వివిధ కార్యాలయాల అధికారులు హిందీ భాషా వినియోగంపై అర్ధ సంవత్సర నివేదికలను సమర్పించారు. హిందీ అమలు ప్రగతిని నివేదికల్లో వివరించారు. విమానయాన విభాగం డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి, ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ బి.వెంకటేశ్వర్లు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విజయవాడ ప్రాంతీయ కార్యాలయం అధికారి ఎస్.శ్రీనివాస్, డివిజనల్ ఆఫీసుకు చెందిన అధికారులు, పాస్ పోర్టు ఆఫీసు నుంచి శివహర్ష, కస్టమ్స్ ఆఫీసు నుంచి అబ్దుల్ అజీమ్ పాల్గొన్నారు.

మోదీ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం

● పీడీఎస్‌యూ ఆవిర్భావ సభలో వక్తలు

గవర్నర్‌పేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మిస్తామని భగత్‌సింగ్ మేనల్లుడు, అఖిల భారత విద్యా హక్కుల వేదిక చైర్మన్ ప్రొఫెసర్ జగన్మోహన్ సింగ్ తెలిపారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఏర్పడి 50ఏళ్లు నిండుతున్న సందర్భంగా అర్ధ శతాబ్దోత్సవ సభ మంగళవారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే)లో జరిగింది. సభ ప్రారంభంలో పీడీఎస్‌యూ పూర్వ అధ్యక్షుడు పి.ప్రసాద్ జెండాను ఆవిష్కరించారు. సభకు రాష్ట్ర అధ్యక్షుడు ఈ భూషణం రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఢిల్లీ వర్శిటీ ప్రొఫెసర్ జగన్మోహన్ సింగ్ మాట్లాడుతూ భగత్‌సింగ్ ఏర్పరచిన విద్యార్థి సంఘం నవ జవాన్ భారత్ సభకు 100 ఏళ్లు, పీడీఎస్‌యూకు 50 ఏళ్లు నిండటం చరిత్రాత్మకమన్నారు. మోదీ ప్రభుత్వం ఫాసిస్ట్ చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్మిస్తామన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కె.భాస్కర్, వినోద్‌కుమార్, సహాయ కార్యదర్శులు రాజేష్, నాని, సునీల్, ఉపాధ్యక్షులు అంకన్న, మహర్షి, రాష్ట్ర నేతలు రాంబాబు, అభిశ్రీ, నాగేశ్వరరావు, అఖండ పాల్గొన్నారు.

7న రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం

బస్టేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో ఈనెల 7న జరగనున్న ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో సమస్యలపై చర్చించి అవసరమైన కార్యాచరణను రూపొందిస్తామని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన సెంట్రల్ కమిటీ సమావేశంలో వచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకుని సమస్యలను పరిష్కరించాలని, ఎండీ అందుబాటులో లేనందున పరిపాలనా విభాగం ఈడీ జీవీ రవివర్మకు మెమోరాండం ఇచ్చామన్నారు. మెమోరాండంలో పేర్కొన్న సమస్యల పరిష్కారానికి ఈనెల 7న సిద్ధార్థ ఆడిటోరియంలో జరగనున్న యూనియన్ రాష్ట్రస్థాయి సమావేశంలో చర్చించి కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

‘అస్త్రం’లో అప్‌డేట్ అవ్వండి

● ట్రాఫిక్ సిబ్బందికి సీపీ ఆదేశాలు

విజయవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ జామ్‌లను గుర్తించడానికి కొత్తగా తెచ్చిన అస్త్రం యాప్‌లో ట్రాఫిక్ పోలీసులు అప్‌డేట్ అవ్వాలని పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు ఆదేశించారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ట్రాఫిక్ విభాగ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, యాప్ నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అస్త్రం యాప్‌లో ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ నిలిచినప్పుడు తక్షణమే గుర్తించి అక్కడున్న సిబ్బందికి కమాండ్ కంట్రోల్ రూం నుంచి అలర్ట్ ఇస్తున్నామన్నారు. అక్కడ ట్రాఫిక్ ఏ కారణంగా నిలిచింది.. సమస్యను పరిష్కారానికి ఎంత సమయం పట్టిందన్న వివరాలను సిబ్బంది యాప్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. దీంతో ఏ కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయో తెలుసుకునే వీలుంటుందన్నారు. ట్రాఫిక్ విభాగ ఏడీసీపీ ప్రసన్నకుమార్, నగరంలో వివిధ ట్రాఫిక్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

దేశంలోనే అత్యుత్తమ క్రీడా విధానానికి శ్రీకారం

● మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి



బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభోత్సవంలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే గద్దె

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యుత్తమ క్రీడా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయడానికి శ్రీకారం చుట్టామని మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ వెల్లడించారు. నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి కృష్ణా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ (కాసా) అండర్-13 బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవంలో ఆయన మంగళవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్‌కృష్ణ చిత్రపటానికి మంత్రి నివాళులర్పించారు. స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి బ్యాడ్మింటన్‌ను ఆడి పోటీలను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ క్రీడా సంఘాల తోడ్పాటుతో రాబోయే కాలంలో ఇలాంటి క్రీడా పోటీల నిర్వహణ చేస్తామన్నారు. రాష్ట్రంలో ఇండోర్ స్టేడియాల నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని, దేశంలోనే అత్యుత్తమ స్పోర్ట్స్ హబ్‌ను అమరావతిలో నిర్మించడానికి సీఎం చంద్రబాబు అడుగులు వేస్తున్నారన్నారు. ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముక్కాల ద్వారకానాథ్, పోలినేని అంకమ్మ చౌదరి మంత్రి, ఎమ్మెల్యేలను సత్కరించారు. ఈ నెల 7 వరకు అండర్-13 బాలబాలికల సింగిల్స్, డబుల్స్ మ్యాచ్‌ల్లో తలపడనున్నారు. ఇందులో సత్తా చాటిన క్రీడాకారులతో రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారు.

ఈ టీమ్ జమ్మూకాశ్మీర్‌లో ఈ నెల 27నుంచి 30వరకు జరిగే 36వ జాతీయ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుంది.

9న పున్నమీఘాట్ వద్ద సీ ప్లేన్ వేడుక

వన్‌టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న నగరంలో మొట్టమొదటిసారిగా సీ ప్లేన్ ప్రారంభోత్సవం జరగనుంది. బబ్బూరి గ్రౌండ్స్ పున్నమీఘాట్ వద్ద మంగళవారం సీ ప్లేన్ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై మ్యారీ టైం బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రవీణ్ ఆదిత్య, సబ్ కలెక్టర్ కె. చైతన్య, ఈవెంట్ ఆర్గనైజర్లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. వీఐపీలకు, ఇతరులకు ఈవెంట్‌ను వీక్షించేందుకు మౌలిక సదుపాయాలు కల్పించటానికి సీటింగ్, తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్లు, ప్రవేశద్వారాల ఏర్పాటు, ఎల్‌సీడీల ద్వారా సీ ప్లేన్‌ల ప్రత్యక్ష ప్రసారం వంటి వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీఎంసీ ప్రాజెక్టుల విభాగం అదనపు కమిషనర్ డాక్టర్ బి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథరెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ బి.వి.వి.ఎస్.వి. ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఈఈ వెంకటేశ్వరరెడ్డి, జాయింట్ డైరెక్టర్ అమృత్, పీవో (యూసీడీ) ఇన్‌చార్జి డాక్టర్ లత పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

విజయవాడ: పున్నమిఘాట్‌లో నిర్వహించే స్కై మీట్స్ సీ (సీప్లేన్ సర్వీసు) బందోబస్తు ఏర్పాట్లను పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు మంగళవారం పరిశీలించారు. వీఎంసీ, రెవెన్యూ, పర్యాటక శాఖ సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా బందోబస్తు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నందున బందోబస్తు పటిష్టంగా ఉండాలన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	132,141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.555

రైతు సమస్యల పరిష్కారానికే రీ సర్వే గ్రామసభలు



తోట్లవల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం. కుసుమకుమారి కోరారు. మండలంలోని గుర్విందపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామసభలో సర్పంచ్ ఉదయభాస్కర్, మండల సర్వేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్ శివరామ్‌ప్రసాద్, వీఆర్వో శ్రీనివాసరావు, కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో కోచ్ రామకృష్ణ, యాజమాన్యం

కరాటేలో షైనింగ్ స్టార్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 23వ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ -2024లో స్థానిక రాఘవేంద్రనగర్‌లోని షైనింగ్ స్టార్ స్కూల్ విద్యార్థులు బహుమతులు సాధించారు. ఆదివారం విజయ వాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో గౌహర్ జహ, లోహిత్ రాజ్, మోహిత్ నంద ఆఫ్‌లైన్ కేటగిరిలో, మనస్విత్ ముఖర్జీ, రఫ బూక్ అహ్మద్, నాగూర్ షరీఫ్ ఆన్‌లైన్ కేటగిరిలో ప్రతిభ కనబర్చారు. వీరిని, కోచ్ రామకృష్ణను పాఠశాల యాజమాన్యం లింగమనేని జగదీష్, స్రవంతిలు అభినందించారు.

పోలీసుల అదుపులో నలుగురు పందెంరాయుళ్లు

పెదపారుపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చినపారుపూడి గ్రామ ఊరి చివర కోడి పందేలు వేస్తున్న నలుగురు వ్యక్తులను ఎస్‌ఐ ఫణికుమార్ రెడ్డి అదుపులోకి తీసుకున్నారు. రూ.18,620, 2 కోళ్లు, 2 బైకులు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

బీసీ నేత లుక్కా వెంకట శ్రీనివాసరావు

తోట్లవల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తనపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, స్వాధీనం చేసుకున్న తన సెల్‌ఫోన్ తిరిగి ఇవ్వాలని రొయ్యూరుకు చెందిన బీసీ నాయకుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు వేడుకున్నారు. తోట్లవల్లూరులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రొయ్యూరుకు చెందిన ఓ అగ్రకుల వ్యక్తిపై వాట్సప్‌లో వీడియో పెడితే తనపై అక్రమంగా కేసు నమోదు చేసి ఫోన్ తీసుకున్నారని, ఈ విషయమై ఎస్పీకి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఇంత వరకు ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

నందివాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు ఈ నెల 6లోగా చేయించుకోవాలని తహసీల్దార్ రఘురామరెడ్డి తెలిపారు. నమోదు కొరకు ఫారం-18తోపాటు విద్యార్హత పత్రాలు నకలు కాపీలు గెజిటెడ్ అధికారి సంతకంతో చేయించి నందివాడ తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని ఆయన తెలిపారు.

బీసీ నాయకుడు కొలుసు రాజాకు సత్కారం

గుడివాడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక నీలామహల్ రోడ్డులోని కళాకారుల సంఘం కార్యాలయంలో కళాకారులకు అందించే నెలవారీ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ నాయకుడు కొలుసు రాజాను కళాకారులు ఘనంగా సత్కరించారు.



రాజాను సత్కరిస్తున్న కళాకారులు

బోసి గోడలతో సరి!

- బైపాస్ రోడ్డులో నిర్మాణ దశలో నిలిచిపోయిన షాదీఖానా భవనం
- గతంలో కట్టేదే లేదని తేల్చి చెప్పిన వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వ రాకతో చిగురించిన ఆశలు



నిర్మాణ దశలో నిలిచిపోయిన షాదీఖానా భవనం

(ఆంధ్రజ్యోతి - గుడివాడ)

టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన నిర్మాణాలను అరాచక వైసీపీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా నిలుపుదల చేసింది. దీనికి నిదర్శనమే బోసి గోడలతో వెక్కిరిస్తున్న ముస్లిం షాదీఖానా భవనం. పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తున్న షాదీఖానా ప్రాంగణాన్ని ఇటీవల శుభ్రపరిచారు. స్థానిక పాత బైపాస్ రోడ్డులో ముస్లింలు, పేదలకు షాదీఖానా ఒక వరంలా ఉండేది. ఎన్నో ఏళ్లుగా సేవలందించిన షాదీఖానా శిథిలావస్థకు చేరింది. దీంతో ముస్లిం మైనార్టీ నాయకులు ఆనాటి ముఖ్యమంత్రి చంద్ర బాబును కలిసి సమస్యను విన్నవించుకున్నారు. వెంటనే స్పందించిన చంద్రబాబు షాదీఖానా నిర్మాణానికి రూ.96లక్షలు మంజూరు చేశారు. సదరు నిధులను జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ చేశారు. దీంతో పని ప్రారంభించి 35శాతానికి పైగా పనులు నిర్వహించారు. దాదాపుగా రూ.28లక్షల మేర కాంట్రాక్టర్ ఖర్చు పెట్టారు.

జగన్ రివర్స్ దెబ్బకు షాదీఖానా బలి

వైసీపీ అధికారంలోకి రావడంతోనే టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు, నిర్మాణాలను నిలుపుదల చేయాలని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి హుకుం జారీ చేశారు. రివర్స్ టెండరింగ్ దెబ్బకు షాదీఖానా బలైంది. దీంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని అనాలోచిత నిర్ణయంతో షాదీఖానా నిధులు వెనక్కి వెళ్లడంతో మళ్లీ షాదీఖానా పరిస్థితి మొదటికి వచ్చింది. దీంతో తిరిగి రాష్ట్ర ప్రభుత్వం కరుణిస్తేనే నిర్మాణం జరిగే పరిస్థితి నెలకొంది.

ముస్లిం షాదీఖానా నిర్మాణంపైన ఎమ్మెల్యే వెనిగండ్ల దృష్టి సారించారు. ఆయన ఇటీవల పలు మార్లు స్థానిక ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించి షాదీఖానా స్థితిగతులను తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరుకు కృషి చేసి త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల ఆలోచనలో ఉన్నారు.



పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎం హెచ్‌వో గీతాబాయి

గుడ్లవల్లేరు పీహెచ్‌సీలో డీఎం హెచ్‌వో తనిఖీ

గుడ్లవల్లేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి గీతాబాయి గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. ఎన్‌సీడీ సర్వేని తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి చేయాలని సంబంధిత ఉద్యోగులను ఆదేశించారు. హై రిస్క్ ఉన్న గర్భిణులను ముందుగానే గుర్తించి వారికి జాగ్రత్తను సూచిస్తు అప్రమత్తంగా ఉండాలని ఆశ, ఏఎన్ఎంలకు సూచించారు. ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీలు తప్పనిసరిగా జరిగేలా చూడాలన్నారు. ఈనెల 14 నుంచి రానున్న అంగన్వాడీల్లో స్ర్కీనింగ్ పరీక్షలు కూడా సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎన్.గోపాల్ నాయక్, డాక్టర్ ఎం.యశశ్విని, వెంకటాద్రి పాల్గొన్నారు.



రామన్నపూడిలో ఇళ్లను పరిశీలిస్తున్న హౌసింగ్ ఈఈ గుమ్మడి రత్నశ్రీ

గృహనిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయండి

గుడివాడ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో హౌసింగ్ స్కీమ్ పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు గృహనిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఈఈ గుమ్మడి రత్నశ్రీ అన్నారు. మంగళవారం రామన్నపూడిలో హౌసింగ్ లేఅవుట్లను పరిశీలించారు. మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమం కింద ఈఈ వివిధ గృహస్థుల వద్దకు వెళ్లి నిర్మాణ పనులు ఏలా జరుగుతుంది, ఇంకా ఏలాంటి మెటీరియల్ కావాలో లబ్ధిదారులను అడిగి వివరాలు సేకరించారు. 2025 మార్చి 31 నాటికి అన్ని గృహాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రామోజీనాయక్, హౌసింగ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

గుడివాడ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై విధి విధానాలు, అవగాహనపై రైతులతో చర్చిస్తున్నట్లు ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. మంగళవారం బొమ్ములూరు, సెరిదింటకుర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. పొలంలోకి వెళ్లి వివిధ తెగుళ్లు ఏ విధంగా వస్తాయో ఏడీఏ వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం అతి త్వరలో ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు ధాన్యం బస్తాలను మిల్లులకు పంపించేటప్పుడు జీపీఎస్ పరికరాలు తప్పనిసరిగా అమర్చి ధాన్యాన్ని ట్రాక్టర్లలో, లారీల ద్వారా పంపించాలని కోరారు. ప్రతి రైతు ఇటువంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ధాన్యాన్ని సక్రమమైన ధరలకు అమ్ముకోవాలన్నారు. ఏవో బోలెం అనంతలక్ష్మి, బొమ్ములూరు, సెరిదింటకుర్రు రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



తృతీయ స్థానం సాధించిన కృష్ణాజిల్లా ఖో-ఖో జట్టు

ఖో-ఖోలో కృష్ణా జట్టుకు తృతీయ స్థానం

గుడివాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా తుమ్మపాలలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో ఖో-ఖో విభాగంలో కృష్ణాజిల్లా బాలుర జట్టు తృతీయ స్థానం సాధించింది. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చేతుల మీదగా జ్ఞాపిక, బహుమతిని బాలుర జట్టు అందుకుంది. విజయం సాధించిన జట్టును జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, చీఫ్ ప్యాట్రన్ కొసరాజు అవినాష్, అధ్యక్షకార్యదర్శులు మడకా ప్రసాద్, ఎం.సత్యప్రసాద్, తదితరులు మంగళవారం అభినందించారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో డా.కెకెఆర్స్ విద్యార్థిని ప్రతిభ

68వ స్కూల్ గేమ్స్ అండర్-14 బాస్కెట్‌బాల్ పోటీల్లో డా.కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థిని అక్కినేని ధృతి కీలకపాత్ర పోషించిందని పాఠశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఈ పోటీల్లో కృష్ణాజిల్లా జట్టు వెండి పతకం సాధించగా, జట్టు విజయంలో ధృతి కీలకపాత్ర పోషించిందని తెలిపారు. మంగళవారం స్థానిక పాఠశాల ఆవరణలో ధృతిని అభినందించారు. విద్యార్థిని ధృతి, కోచ్ మడకా సత్యఅన్వేష్‌లను ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఖోఖో విజేతకు అభినందన

పెదపారుపూడి : తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఖో-ఖో పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని జి.అనిత ప్రశంసాపత్రం పొందిందని యలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.పద్మావతి తెలిపారు. సర్పంచ్ కె.అనూష, ఉప సర్పంచ్ సూరపనేని సత్యనారాయణ, విద్యాకమిటీ సభ్యులు, శిక్షణ ఇచ్చిన పిఎం.సోమేశ్వరరావు, విద్యార్థినిని అభినందించారు. సాంబశివరావు, సత్యానారాయణ, అంబేడ్కర్, కరుణ్ కుమార్, మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అడ్డాడ అరవింద హైస్కూల్లో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, గౌతమి సరోజ, తదితరులు

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరా

చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సామాన్య మధ్యతరగతి వర్గానికి చెందిన కుటుంబాల ఆరోగ్య పరిరక్షణకోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఆసరాగా నిలుస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతున్న 29మందికి మంజూరైన రూ. 19లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే కుమార్‌రాజా పార్టీ నేతలతో కలిసి అందజేశారు. ఈ కార్యక్ర మంలో మండల పార్టీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, పార్టీ నేతలు వీరంకి వేంకటేశ్వరరావు, పెదమద్దాలి ప్రభాకర్, కోసరాజు వేంకటేశ్వరరావు, నూకవరపు వీరాంజనేయులు, డెక్కా వీరాం జనేయులు, కేదరాశిపల్లి శ్రీనివాసరావు, మిక్కిలినేని పండు, తాడిశెట్టి గంగాధర్ మం తెన రామాంజనేయులు, జన్ను శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

మండల పరిధిలోని అడ్డాడ అరవింద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో జయప్రద ఫౌండేషన్ నెలకొల్పిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమార్ రాజా మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు జయప్రద ఫౌండేషన్ ట్రస్టీ ఛైర్మన్ గౌతమి సరోజ, 20 సూత్రాల అమలు ఛైర్మన్ లంకా దినకర్‌లు అందిస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాభారతి వైస్ ప్రెసిడెంట్ వెలగపూడి రామకృష్ణ, జయప్రద ఫౌండేషన్ సీఈవో చాముండేశ్వరి, మేనేజింగ్ ట్రస్టీ గౌతమి సరోజ తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కూటమి ప్రభుత్వం హరించడం తగదు

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్

పామర్రు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల చేత గ్రామ ప్రథమ పౌరుడుగా ఎన్నుకోబడిన సర్పంచ్, ఎంపీ టీసీలకు రాజ్యాంగం కల్పించి హక్కులను కూటమి ఎమ్మెల్యే, ఆ పార్టీ గ్రామ నేతలు హరించడం ఎంతమాత్రం తగదని పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం పెదపారుపూడి మండలానికి చెందిన పలువురు వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి నేతలు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు కేటాయించిన ప్రభుత్వ నిధులు అధికారుల అండదండలతో సర్పంచ్, ఎంపీటీసీల ప్రమేయం లేకుండా ఇష్టారాజ్యంగా కేటాయింపు చేయడం పట్ల మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



గుడివాడలో పుట్టలో పాలు పోసేందుకు బారులు తీరిన భక్తులు



గుడివాడ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో..



గాజులపాడు నాగేంద్ర స్వామి దేవాలయం వద్ద..



మంటాడ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో

గుడివాడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : నాగులచవితి పర్వదినం సందర్భంగా మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గల శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో, ఎన్‌టిఆర్ స్టేడియం వద్ద, పెద ఎరుకపాడులోని దేవాలయాల్లో భక్తులు వేలాదిగా తరలివచ్చి పుట్టలో పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు.

గుడ్లవల్లేరు : మండలంలో నాగుల చవితిని మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. డోకిపర్రు నాగేంద్ర స్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించారు. అలానే గుడ్లవల్లేరు సిద్ధేశ్వర స్వామి ఆలయంలో పుట్టలో భక్తులు పాలుపోసి పూజించారు. ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు నిర్వహించారు.

పామర్రు: మండల పరిధిలో మంగళవారం వేకువజాము నుంచే మహిళలు పెద్దసంఖ్యలో నాగపుట్టల వద్ద పాలు పోయడానికి బారులు తీరారు. పొలాల మధ్య పుట్టల వద్ద చిన్నారులు టపాసులు పేల్చారు. అనంతరం సమీపంలోని శివాలయాల్లో పరమశివున్ని దర్శించుకుని ప్రత్యేక పూజాదికాలు జరిపించుకున్నారు. నెమ్మలూరు నాగేశ్వరస్వామి, స్థానిక శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



వెంట్రప్రగడ పుట్టలో పాలుపోస్తున్న భక్తులు

కూచిపూడి: మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో పుట్టల వద్దకు భక్తులు చేరుకుని నైవేద్యాలు సమర్పించి పుట్టలో పాలుపోశారు. దేవాలయాల్లో ఉన్న నాగేంద్రుని విగ్రహాల వద్ద కూడా భక్తులు పాలు పోసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కూచిపూడి, చిన ముత్తేవి, పెదపూడి, అయ్యంకి, మొవ్వ, గూడ పాడు, కోసూరు, కాజ గ్రామాల్లో ప్రసిద్ధి చెందిన పుట్టలు ఉండటంతో భక్తులు పాలుపోసి పూజలు చేశారు.

నందివాడ: నందివాడ, కుదరవల్లి, గాజులపాడు నాగేంద్ర స్వామి దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు పుట్టలో పాలుపోసి గుడ్లు వేసి పూజలు చేశారు. రుద్రపాక శివారు గాజులపాడు నాగేంద్ర స్వామి దేవాలయంలో భక్తులు ఎక్కువ గా ఉండటంతో ఎస్‌ఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

పమిడిముక్కల: మండల పరిధి కపిలేశ్వరపురం పరిధి లంకతోటలో ఉన్న శ్రీగంగా బాలా త్రిపు ర సుందరీదేవి సమేత పాపవినాశనేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తరలివచ్చి పూజలు చేసి పుట్టలో పాలు పోశారు. మంటాడ వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద పుట్టలో పాలుపోసి భక్తులు పూజలు చేశారు. శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం పరిధి పాపవినాశన ఆలయం వద్ద

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.555



పేద విద్యార్థులను ఆదుకుందాం

మచిలీపట్నం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని గాయత్రీ సేవాట్రస్టు అధ్యక్షుడు పోతరాజు శ్రీశివరామశర్మ అన్నారు. కార్తీకమాసాన్ని దృష్టిలో ఉంచుకుని దేవాలయాల్లో పరమశివునికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించాలన్నారు. బ్రాహ్మణులందరూ సంఘటితమై వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బ్రాహ్మణులతో పాటు సేవాతత్పరత గల ఇతర కులాల వారిని కూడా ట్రస్టులో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.



పోతరాజు శివరామశర్మ

కస్తూరి క్షమాపణ చెప్పాలి

అవనిగడ్డ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతికి అవమానం వచ్చేలా మాట్లాడిన బీజేపీ నేత, నటి కస్తూరితెలుగుజాతికి క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ డిమాండ్ చేశారు. తెలుగువారు తమిళనాడులో అఃతపుర మహిళలకు సేవ చేసేందుకు వచ్చారని కస్తూరి చేసిన వ్యాఖ్యలు తెలుగుజాతికే అత్యంత అవమానకరమన్నారు. ఈ వ్యాఖ్యలను ప్రతీ ఒక్కరూ ఖండించాలని ఆయన కోరారు.

స్వచ్ఛందంగా టీడీపీ సభ్యత్వం

నాగాయలంక : తెలుగుదేశం పార్టీ విధానాల పట్ల ప్రజలు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాలు స్వీకరిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు అన్నారు. నాగాయలంకలోని రాఘవా దత్తా నిధి రెసిడెన్షియల్‌లో మంగళవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. జిల్లా కార్యదర్శి లకనం నాగాంజనేయులు, ఉప్పల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నాగాయలంకలో..



ఘంటసాలలో..



మచిలీపట్నంలో..



చల్లపల్లిలో..

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు

● కిటకిటలాడిన దేవాలయాలు ● నాగేంద్రస్వామి పుట్టల వద్ద భక్తుల ప్రత్యేక పూజలు

నాగాయలంక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆయలంలో, నంగేగడ్డ - మర్రిపాలెం శివనాగరాజస్వామి ఆలయంలోని నాగేంద్రస్వామి పుట్టల వద్ద మంగళవారం మహిళలు పూజలు నిర్వహించారు.

ఘంటసాల : వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. దేవాలయ ప్రాంగణంలో ఉన్న నాగపుట్టలో పాలుపోసి పూజలు చేశారు. చల్లపల్లి, దేవరకోట, కొడాలి, అచ్చెంపాలెం, చిలకలపూడి, తదితర గ్రామాల్లో నాగపుట్టల వద్ద పూజలు చేశారు.

చల్లపల్లి: చల్లపల్లి ఆరవ నెంబరు కాలువ గట్టున నాగపుట్టలో భక్తులు పాలుపోశారు. నాదెళ్లవారిపాలెం, పాతమాజేరు, నాగపుట్టల్లో పాలుపోసి పూజలు చేశారు.

మచిలీపట్నం టౌన్ : సుల్తానగరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం, మేకావారిపాలెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాల్లో మహిళలు పాలు పోసి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఫతుల్లాబాద్‌లోని చారిత్రక దేవాలయం వద్ద హిందువులతో పాటు ముస్లిం మహిళలు పాలు పోసి తమ మొక్కులు తీర్చుకున్నారు.

బంటుమిల్లి: జానకిరామాపురంలో వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి సన్నిధిలో గల పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపన ట్రస్టీ, సెక్రటరీ గంగిశెట్టి దేవానంద్ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

మచిలీపట్నంటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలని డీఈవో రామారావుకు ఫ్యాప్టో నాయకుడు, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మద్ది బాబూరాజేంద్ర ప్రసాద్ కోరారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో ఫ్యాప్టో నాయకులతో సమావేశం జరిగింది. ఎస్టీయు నాయకుడు ఇమానుయేల్, ఏపీటీఎఫ్ నాయకుడు లంకేష్, సుబ్రహ్మణ్యం, యూటీఎఫ్ నాయకుడు కనకారావు, బిటిఏ నాయకుడు ఎం. రాజేష్, ఎస్సీ ఎస్టీ సంఘ రాష్ట్ర కార్యదర్శి చిన్నం బాబూరావు, పి. రవికుమార్,శ్రీకాంత్, రత్నకుమార్, శ్రీహరి, ఎం. రవికుమార్, జి. రాజు, దాసరి చిన్నాలు పాల్గొన్నారు. డీఈవోకు వినతిపత్రం అందించారు.



వినతిపత్రం ఇస్తున్న నేతలు

550 మందికి కంటి పరీక్షలు

నాగాయలంక: పర్రచివర గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త బొండాడ గ్రూప్స్ కంపెనీల అధినేత డాక్టర్ బొండాడ రాఘవేంద్రరావు ఆర్థిక సాయంతో మంగళవారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వృద్ధులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు నరేష్, సిబ్బంది 550 మంది రోగులకు కంటి పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. వారిలో 400 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ఈ నెల 29న బొండాడ రాఘవేంద్రరావు జన్మదిన వేడుక సందర్భంగా కళ్లజోళ్లను ఉచితంగా పంపి ణీ చేయనున్నట్టు తెలిపారు. డాక్టర్ వంగర శేషగిరిరావు, శివ పార్వతీ, అల్లపర్తి జయంతి, తలశిల రఘుశేఖర్, నారాయణ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

కోడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. కోడూరు శివారు నరసింహాపురం గ్రామ సమీ పంలో మంగళవారం లింగన్నకోడు మీడియం డ్రైనేజీపై నూతనంగా నిర్మించిన వంతెనను ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ ఎంపీ కనక మేడల రవీంద్ర కుమార్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. అనంతరం శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎ మ్మెల్యే మాట్లాడుతూ మాజీ ఎంపీ కనకమేడల రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో రూ.18.40 లక్షలు, ఎంపీ వల్లభనేని బాలశౌరి ఇచ్చి నిధులు రూ.25 లక్షలతో ఈ వంతెన నిర్మించారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, తహసీల్దార్ శ్రీను నాయక్, పంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు, బండే శ్రీనివాసరావు, మర్రె గంగయ్య, గుడివాక శేషుబాబు, యాసం చిట్టిబాబు, బచ్చు వెంకటనాథ్, కొండవీటి సునీత, పూతబోయిన శ్రీనివాసరావు, ఉల్లి శేషగిరిరావు, డ్రెయినేజీ ఈఈ గోపీనాథ్, డీఈ జె.బాబూనాయక్, ఇరిగేషన్ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బాలశౌరి

నకిలీ విత్తనాలు ఇచ్చిన వారిపై చర్యలు చేపట్టాలి

ఘంటసాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలను విక్రయించి రైతును నట్టేట ముంచిన ట్రేడర్స్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. చినకళ్లేపల్లికి చెందిన గుత్తికొండ వెంకట సుబ్బారావు తన 19 ఎకరాల మాగాణిలో చల్లపల్లిలోని శ్రీ దుర్గాభవాని ట్రేడర్స్ వారి వద్ద నుంచి ఎంటీయూ 1224 (గణపతి సీడ్స్) విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేయగా, వరి పంటలో ముళ్ల బెరుకు ఎక్కువగా రావటం, ముదురు సాగు చే సినప్పటికీ నేటికీ పక్వానికి రాలేదని రైతు వాపోయాడు. దీంతో పంటను వ్యవసాయ శాఖాధికారి కె.మురళీకృష్ణతో కలసి రైతు సంఘ నాయకులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ కల్తీ విత్తనాల వల్ల రైతులు పూర్తిగా నష్టపోయినట్లు తెలిపారు. విత్తనాలను విక్రయించే ట్రేడర్స్‌పై వ్యవసాయ శాఖాధికారులు సరిగా పర్యవేక్షించకపోవటం వల్ల కూడా కల్తీ విత్తనాలు మార్కెట్‌లోకి విడుదలవుతున్నాయన్నారు. కల్తీ విత్తనాలను సరఫరా చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘ నాయకులు అడ్డాడ ప్రసాద్ బాబు, హనుమానుల సురేంద్ర నాథ్ బెనర్జీ, వేమూరి రత్నగిరిరావు,రామారావు డిమాండ్ చేశారు.



వరి సాగును పరిశీలిస్తున్న నేతలు

నాలుగేళ్లుగా ఫిల్టర్‌బెడ్‌లు క్లీన్ చేయని దుస్థితి

మచిలీపట్నంటౌన్ , నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాలుగేళ్లగా హెడ్ వాటర్ వర్క్స్ వద్ద మచిలీపట్నం నగర ప్రజలకు తాగునీరందించే ఫిల్టర్‌బెడ్స్ పూడికలు తీయక పోవడంతో తాగునీరు రంగుమారి సరఫరా అవుతుందని ప్రజాదర్బార్‌లో మంత్రి కొల్లు రవీంద్రకు నగర ప్రజలు పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరపాలని మంత్రి రవీంద్ర అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా వాటిని శుభ్రం చేసే కార్యక్రమానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఏఈ నాయక్‌తోపాటు టీడీపీ నాయకులు మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, దేవరపల్లి అనిత , అన్నం ఆనంద్ , చిత్తజల్లు నాగరాము, సుధాకర్, గొర్రెపాటి గోపీచంద్ తదితరులు పరిశీలించారు. మోటార్లతో నీటిని తోడిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజలను నిర్లక్ష్యంగా వదిలేశారని ఆరోపించారు.



బెడ్లు పరిశీలిస్తున్న మోటమర్రి బాబాప్రసాద్

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి సహకరించండి

చల్లపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ఆమోదానికి సహకరించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, బందరు ఎంపీ వల్లభనేని బాలసౌరిని కోరారు. చల్లపల్లిలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి ఎంపీ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీని కలిసి రత్నకుమారి మాట్లాడుతూ, చట్టసభలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్లకు సంబంధించి నవంబరులో జరిగే పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ఆమోదించే విధంగా సహకరించాలన్నారు. హనుమానుల రాణికుమారి, అట్లూరి స్వరూప, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న మహిళా నేతలు

టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదు

ఘంటసాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు హెచ్చరించారు. దాడిలో గాయపడిన కార్యకర్తలను మంగళవారం శ్రీకాకుళంలో పరామర్శించారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, రవిప్రసాద్ పాల్గొన్నారు.

సూరపనేనివారిపాలెంలో జరిగిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఘంటసాల ఎస్సై ప్రతాప్‌రెడ్డి గాయపడిన టీడీపీ కార్యకర్తలను రాజీపడమని బెదిరింపు ధోరణిలో వ్యవహరించటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు తెలిపారు. వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన రాచూరి రాజశేఖర్, ప్రవీణ్‌లకు న్యాయం చేయాల్సిన పోలీసుల తీరు బాగోలేదన్నారు. దీనిని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళతానన్నారు.



కార్యకర్తలను పరామర్శిస్తున్న శ్రీనివాసరావు

అగ్ని ప్రమాద బాధితులకు రూ.25 వేలు సాయం

నాగాయలంక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పర్రచివర పంచాయతీ శివారు దుర్గా ప్రసాద్ పురంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సర్వస్వం కోల్పోయిన మెండు నాగమల్లేశ్వరరావు కుటుంబానికి ప్రముఖ పారిశ్రామిక వేత్త డాక్టర్ బొండాడ రాఘవేంద్రరావు ఆర్థిక సాయమందించారు.

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం

మోపిదేవి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా కృష్ణా మిల్క్ యూనియన్ పని చేస్తుందని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. రావివారిపాలెం, పెదప్రోలు, పెదకళ్లేపల్లి పాల ఉత్పత్తిదారుల సంఘాలను మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. పశు పోషణలో ఎదురయ్యే ఇబ్బందులను రైతులతో నేరుగా మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘాల అధ్యక్షులను సత్కరించారు. రావివారిపాలెం సంఘ అధ్యక్షులు రావి లక్ష్మణరావు, కృష్ణా మిల్క్ యూనియన్ ట్రస్ట్ బోర్డు సభ్యులు గోళ్ల పూర్ణమల్లికార్జునరావు, జిల్లా డైరెక్టర్ కొమ్మారెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధ్యక్షుడిని సత్కరిస్తున్న చైర్మన్ ఆంజనేయులు

ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభం

చల్లపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి పెద్ద మసీదు ఎదుట ముస్లిం స్మశానవాటిక అభివృద్ధి పనులు ఎంపీ వల్లభనేని బాలసౌరి మంగళవారం ప్రారంభించారు. ఎంపీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించనున్న బహుళ ప్రయోజిత సామాజిక భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, పీఆర్ డీఈఈ పి.సురేష్‌బాబు, ఎంపీపీ కోట విజయ రాధిక, జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్‌ఎంపీపీ మోర్ల రాంబాబు, మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ న సీం షోరి తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీ బాలసౌరి

మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండ

కోడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కోడూరు ఇండోర్ స్టేడియం వద్ద కోడూరు, నాగాయలంక మండలాల మత్స్యకారులకు 239 ఐస్ బాక్సుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ రాజ్య సభ సభ్యులు కనకమేడల రవీంద్ర హాజరయ్యారు. చిలకలపూడి పాపారావు, తహసీల్దార్ శ్రీను నాయక్, ఎంపీడీవో సుధా ప్రవీణ్, ఏడీఏ ప్రతిభ, ఎఫ్‌డీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు పాల్గొన్నారు.



ఐస్‌బాక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

కూటమి ప్రభుత్వంలో గ్రామాలకు మహర్దశ

అవనిగడ్డ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామాలకు మహర్దశ వచ్చిందని ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డలోని 9వ వార్డులో మంగళవార రూ.16.60 లక్షలతో నూతనంగా నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను ప్రారంభించారు.

అవనిగడ్డ నియోజకవర్గాన్ని కలుపుతూ మచిలీపట్నం నుంచి రేపల్లె వెళ్లే రైల్వే లైన్ త్వరలోనే సాకారమవుతుందని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ఇప్పటికే మచిలీపట్నం - రేపల్లె రైల్వే లైన్ సర్వేకు కేంద్రం ఆదేశాలిచ్చిందన్నారు. మండలి వెంకట్రామ్, పాపారావు, సుమతి, బండే కనకదుర్గ, కొల్లూరి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, పరుచూరి దుర్గా ప్రసాద్, యాసం చిట్టిబాబు, గుడివాక శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బాలశౌరి

ఉపాధి హామీ గ్రామ సభలు

మోపిదేవి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రావి దుర్గావాణి అన్నారు. మోపిదేవి, మోపిదేవిలంక పంచాయతీ కార్యాలయాల వద్ద మంగళవారం ఉపాధి హామీ పథకం గ్రామసభలు జరిగాయి. చేపట్టాల్సిన పనుల వివరాలను ఏపీవో ముత్యాలు తెలియజేశారు. సర్పంచ్‌లు మేరాణి, జ్యోత్స్న, టెక్నికల్ అసిస్టెంట్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటు నమోదు కార్యక్రమం

బంటుమిల్లి: అర్హులైన ప్రతి పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు ప్రక్రియలో పాల్గొనాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కోరారు. లక్ష్మీపురం సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఓటు నమోదు ప్రక్రియలో పాల్గొన్నారు. ఓటు నమోదు ప్రక్రియ ముగియనుందని మంగళవారం దాదాపు 200కు పైగా ఓట్లు నమోదు అయ్యాయన్నారు. కూనపరెడ్డి వీరబాబు, బాజీ, నాగబాబు, కృష్ణ, మల్లేశ్వరరావు, భూపతి రమేష్, ప్రసాద్, కొండ, పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

అవనిగడ్డ: రాష్ట్రంలో 104లో ఉద్యోగులుగా పని చేస్తున్న తమకు ప్రభుత్వం వృత్తి భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ 104 ఎన్ఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. వైసీపీ ప్రభుత్వంలో 104లో బాధ్యతలు చేపట్టిన అరబిందో యాజమాన్యం ఆ బాధ్యతల నుంచి తప్పుకుందని, గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో డ్రైవర్లు, డీఈవోలు పలు ఇబ్బందులు పడ్డారని, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకంటే తక్కువ వేతనాలకు తాము పని చేశామన్నారు. తమకు రావాల్సిన ప్రయోజనాలను కూడా సక్రమంగా చెల్లించలేదని 14 రోజులపాటు నిరసన కార్యక్రమాలు చేస్తున్నామని 104 ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు మండల పరిధిలోని వేకనూరు పీహెచ్‌సీ వైద్యులు రాహుల్ ప్రభాకర్‌కు నోటీసు అందజేశారు.

పారిశుధ్యం లోపంపై కలెక్టర్ ఆగ్రహం

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నంలోని పారిశుధ్య లోపంపై కలెక్టర్ డి.కె. బాలాజీ ఆగ్రహం వ్యక్తంచేశారు. కలెక్టర్‌కు వివిధ ప్రాంతాల నగర ప్రజలు పారిశుధ్య లోపంపై ఫిర్యాదులు చేశారు. దీనిపై కమిషనర్ బాపిరాజుతో కలెక్టర్ బాలాజీ చర్చలు జరిపారు. 10 డివిజన్లకు ఒక ఇన్‌చార్జి అధికారిని నియమించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పారిశుధ్యం పట్ల అలసత్వం వహించిన ఉద్యోగులను సస్పెండ్ చేశామని, షోకాజ్ నోటీసులిస్తున్నామన్నారు. నగరంలో చెత్తను సేకరించే వాహనాలు మరలాతిరుగుతున్నందున పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నట్టు కమిషనర్ తెలిపారు.

విజేతలకు ప్రశంసా ప్రతాలు

మచిలీపట్నం టౌన్ : ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాలని కృష్ణాజిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి పి.బి.సాల్మన్‌రాజు అన్నారు. మచిలీపట్నం లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు సాల్మన్‌రాజు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వి. సుందరలక్ష్మి అధ్యక్షతన సభ నిర్వహించారు. పోటీల నిర్వాహకురాలు ఎన్. విజయశ్రీ, డి. శ్రీనివాస్, ఎల్. హరనాథ్, మున్వర్ పాల్గొన్నారు.

చర్మకారులకు షాపింగ్ కాంప్లెక్స్‌లు

మచిలీపట్నం టౌన్ : ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల నుంచి చర్మకారులకు షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ చర్మకారుల సంఘం అధ్యక్షుడు బుల్లా రాజారావు కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన రాజారావు ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవికి వినతిపత్రం అందించారు. ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ. లక్ష రుణాన్ని మంజూరు చేయాలని, అర్హులైన డప్పు కళాకారులు, చెప్పులు కుట్టుకునే కార్మికులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలన్నారు.